


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## చెలరేగిన రఘువంశీ, రింకూ సింగ్..





ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 130 | గురువారం 14 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3


## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం



- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబిన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

# ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు..



**ఆర్థిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యం**

**సామర్థ్యం పెంపుపై సీఎం చంద్రబాబు దృష్టి**

**పటిష్ట ఆర్థిక వ్యవస్థకు సామర్థ్యం పెంపే మార్గం**

**రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రతీ నెలా గణాంకాల సేకరణ**

**రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ**

**ఆర్థిక విశ్లేషణకు ఏఐ టెక్నాలజీ వినియోగం**

**15 శాతం వృద్ధి సాధించి స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 15 శాతం వృద్ధిరేటును స్థిరంగా సాధించడం ద్వారానే స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకోగలమని, దీనికోసం క్షేత్రస్థాయి నుంచి పక్కాగా, వేగంగా గణాంకాలు సేకరించాలని సూచించారు. బుధవారం నాడు సచివాలయంలో ప్రణాళిక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పూర్తిస్థాయి 'డేటా డ్రివెన్ గవర్నెన్స్'కు

2లో

# హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

**ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పోరేట్ ఆఫీస్**

**సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి**



హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సీటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు.

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు



**ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది**

**మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్**

పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు



- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్

# ఆయన్ను చూసి నేర్చుకోండి...

**ప్రధాని మోదీని ఆకాశానికెత్తేసిన నార్వే దినపత్రిక**

- ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించిన నార్వే ప్రముఖ వార్తాపత్రిక
- ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా మోదీని అభివర్ణన
- మోదీని చూసి నార్డిక్ దేశాల ప్రధానులు నేర్చుకోవాలని సూచన
- భారత్ ఆర్థిక, హరిత వృద్ధి విధానాలను కొనియాడిన కథనం
- మోదీకి 70 శాతం ప్రజామోదం ఉందని, యూరప్ నేతలకు ఇది జరగని పని అని వ్యాఖ్య



# అమెరికా 51వ రాష్ట్రంగా వెనెజువెలా...

**ట్రంప్ పోస్టుతో దుమారం**

- ట్రంప్ పోస్టును ఖండించిన వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్
- ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మార్కో రుబియో ప్రయాణిస్తున్నట్లు పోస్టు
- చైనా అధ్యక్షుడితో సమావేశానికి ముందు పోస్టుపై చర్చ



## నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

**దేశంలో ఏకకాలంలో సోదాలు**

**ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పదా?..

**పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగితే ఇంధన ధరల పెంపు తప్పదన్న ఆర్‌బీఐ గవర్నర్**

**ముడి చమురు ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణంపై ఆర్‌బీఐ ఆందోళన**

**ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు రోజుకు రూ.1000 కోట్ల నష్టాలు**

**ధరల పెంపు కాలక్రమేణా జరగవచ్చన్న సంజయ్ మల్హోత్రా**

**దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయన్న కేంద్ర మంత్రి**



పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచక తప్పదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధం వల్ల పెరుగుతున్న ఇంధన ధరలు దేశ ద్రవ్యోల్బణ లక్ష్యాలకు సవాలుగా మారుతున్నాయని, దీనిపై ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన సూచించారు. స్విట్జర్లాండ్‌లో మంగళవారం జరిగిన ఒక సదస్సులో మల్హోత్రా మాట్లాడుతూ.. "పశ్చిమాసియా సంక్షోభం ఇలాగే కొనసాగితే, రిటైల్ ఇంధన ధరల పెంపు అనేది కేవలం సమయం మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, ద్రవ్యోల్బణం మరింత అధికమవుతుంది" అని హెచ్చరించారు.

## విపక్షనేతల అంటే లెక్కలేదా ?

**మోదీ తీరుపై మండిపడ్డ విహెచ్**



## 'మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా మేడ్ ఫర్ ది వరల్డ్'..

**రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర**

**23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు**

**వచ్చే మూడు నెలల్లో 100 ఏపీ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ కావాలని లక్ష్యం**

**'ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదంతో 22 క్లస్టర్ల ఏర్పాటు**

**'మేడ్ ఇన్ ఆంధ్ర మేడ్ ఫర్ ఇండియా మేడ్ ఫర్ ది వరల్డ్' ప్రభుత్వ ధ్యేయం**



ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ బృహత్కార్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. "మేడ్ ఇన్ ఆంధ్ర మేడ్ ఫర్ ఇండియా మేడ్ ఫర్ ది వరల్డ్" అనే నినాదాన్ని సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీూజు), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీఐఐ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన ఎస్ఎంఈ ఐపీఓపై

# ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు..

## ఇకపై నెల నెలా డేటా సేకరణ



శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం త్రైమాసిక, వార్షిక ప్రాతిపదికన రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) అంచనాలు రూపొందిస్తున్నారని, దీనివల్ల వాస్తవ ఆర్థిక పరిస్థితిపై తక్షణ అవగాహన కలగడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఆధారపడటం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విధానాన్ని మార్చి, ప్రతీ నెలా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని జిల్లా, మండల స్థాయిలో ట్రాక్ చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్‌డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, రియల్‌టైమ్ పద్ధతిలో అంచనాలు రూపొందించేలా అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ శిక్షణ ఉండాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా తీర్చిదిద్దాలని సూచించారు. మరోవైపు, వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం పర్యవేక్షణలో లేని ఆర్థిక సూచికలను కూడా గుర్తించి, వాటిని కూడా ట్రాక్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమీక్షలో జీఎస్‌డీపీ సామర్థ్య పెంపు, రాబోయే సర్వేలు, కేపీఐల ఆడిటింగ్ వంటి పలు కీలక అంశాలపై చర్చించారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పదా?.

ఆర్‌బీఐ తదుపరి ద్రవ్య పరపతి విధాన సమావేశం జూన్ 5న జరగనుందని, వడ్డీ రేట్లపై అప్పుడు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. "పరిస్థితిని బట్టి మా విధానాలు ఉంటాయి. షాక్ తాత్కాలికమైతే సర్దుకుపోతాం. కానీ, అది దీర్ఘకాలం కొనసాగితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది" అని ఆయన వివరించారు. మరోవైపు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ.. దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని అన్నారు. అయితే, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయని, ధరల పెంపు అనివార్యం కావచ్చని సూచనప్రాయంగా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటినప్పటికీ, దేశంలో ధరలు పెంచకపోవడంతో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు రోజుకు దాదాపు రూ.1,000 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఇప్పటివరకు చమురు సంస్థల అండర్-రికవరీలు రూ.1.98 లక్షల కోట్లకు చేరగా, ప్రస్తుత జూన్ త్రైమాసికంలో నష్టాలు రూ.1 లక్ష కోట్లకు దగ్గరగా ఉన్నాయని పూరి తెలిపారు. సరఫరాకు అంతరాయం కలగకుండా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, ప్రస్తుతం దేశంలో 76 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం, చమురు సంస్థలు నష్టాలు భరించడం ద్వారా ప్రభుత్వం ధరలను నియంత్రించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెంపు అనివార్యమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

# బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఎస్ఐఆర్‌తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి.

రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు. సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# ఆయన్ను చూసి నేర్చుకోండి...

భారత ప్రధాని నరేంద్ర మోదీపై నార్వేకు చెందిన ప్రముఖ ఆర్థిక దినపత్రిక 'డాగెన్స్ నారింగ్స్‌లివ్' (డీఎన్) ప్రశంసల వర్షం కురిపించింది. మోదీని "ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడు" అని అభివర్ణించిన ఆ పత్రిక, నార్డిక్ దేశాల ప్రధానులు ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాలని సూచిస్తూ ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. మే 18న ప్రధాని మోదీ నార్వే పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ కథనం వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. నార్డిక్ దేశాల ప్రధానులకు కనీసం 30 శాతం ప్రజామోదం కూడా దక్కడం లేదని, కానీ మోదీకి సుమారు 70 శాతం ప్రజామోదం ఉందని ఆ కథనం పేర్కొంది. "ఏ పెద్ద దేశంలోనూ ఏ నాయకుడికీ స్వదేశంలో మోదీ అంతటి జనాదరణ లేదు. ఆయన మళ్లీ పోటీ చేస్తే కచ్చితంగా గెలుస్తారు. ఇది యూరప్ నేతలకు అందని కల" అని వ్యాఖ్యానించింది. మోదీ విజయం వెనుక వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, బలమైన భావజాలం, ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన రాజకీయ పార్టీ, ఆయన స్ఫూర్తిదాయక జీవిత ప్రస్థానం ఉన్నాయని విశ్లేషించింది. సాధారణ కుటుంబం నుంచి వచ్చి, ఉన్నతస్థాయికి ఎదిగిన మోదీ ప్రస్థానం అరుదైనదని, ఈ విషయంలో ఆయనను నార్వే మాజీ ప్రధాని ఐనార్ గెర్హార్డ్‌సెన్‌తో పోల్చింది. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ 7 శాతం వృద్ధితో చైనాను మించి దూసుకెళ్తోందని, 2050 నాటికి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేసింది. పర్యావరణ హిత వృద్ధిలోనూ భారత్ ముందుందని, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేసింది. బీజేపీ పాలనలో మత ఘర్షణలు పెరిగాయన్న విమర్శలను కూడా ఈ కథనం తోసిపుచ్చింది. కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువ హింసాత్మక ఘటనలు జరిగాయని, పొరుగు దేశాల నుంచి లక్షలాది మంది ముస్లింలు భారత్‌కు వలస వస్తున్నారని, కానీ భారత్ నుంచి వెళ్లడం లేదని పేర్కొంది. నియమాల ఆధారిత ప్రపంచం కోసం నార్వేకు భారత్ వంటి మిత్రదేశాలు అవసరమని, భారత్‌కు నీతులు చెప్పడం మాని, ఆ దేశం నుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆ పత్రిక తన కథనాన్ని ముగించింది.

# అమెరికా 51వ రాష్ట్రంగా వెనెజువెలా...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెనెజువెలాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఒక గ్రాఫిక్ ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఈ పోస్టు తీవ్ర దుమారం రేపింది. ట్రంప్ పోస్టును వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ తీవ్రంగా ఖండించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సమయంలో ఆయన నైట్ ట్రాక్ సూట్‌ను ధరించారు. ఆ సూట్‌ను పోలిన ట్రాక్ సూట్‌ను ధరించి, ఎయిర్ ఫోర్స్ వన్‌లో విమానంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రయాణిస్తున్నట్లు కూడా ఈ పోస్టు ఉంది. డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యేందుకు చైనాకు వెళ్లనున్న సమయంలో, సామాజిక మాధ్యమంలో ఈ పోస్టు పెట్టడం చర్చకు దారి తీసింది. వైట్ హౌస్ కూడా ఈ ఫొటోలను తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. వెనెజువెలాను తమ దేశంలోని కొత్త రాష్ట్రంగా పరిగణించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ పేర్కొన్నారు.

## చైనా గడ్డపై కాలుమోపిన ట్రంప్... బీజింగ్ లో ఘనస్వాగతం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా గడ్డపై కాలుమోపారు. బుధవారం ఆయన బీజింగ్ చేరుకున్నారు. దాదాపు ఒక దశాబ్దం తర్వాత అమెరికా అధ్యక్షుడు చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం. బీజింగ్ క్యాపిటల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రంప్‌కు చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ సైనిక గౌరవ వందనంతో ఘనస్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ట్రంప్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు, టెక్నాలజీ పోటీ నెలకొన్న తరుణంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ చర్చల్లో ప్రధానంగా వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), చిప్స్ వంటి సాంకేతిక అంశాలపై దృష్టి సారించనున్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని (ట్రేడ్ ట్రూస్) స్థిరీకరించుకోవాలని రెండు దేశాలూ భావిస్తున్నాయి. అమెరికా వ్యాపారాలు, వ్యవసాయ ఉత్పత్తుల కోసం చైనా మార్కెట్లను మరింతగా అందుబాటులోకి తీసుకురావాలని ట్రంప్ కోరుతున్నారు. ఇరాన్‌కు చైనా అందిస్తున్న ఆర్థిక, వ్యూహాత్మక మద్దతును నిలిపివేయాలని ఆయన ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో ట్రంప్‌తో పాటు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్, ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన భారీ బృందం పాల్గొంటోంది. ఈ భేటీలో కుదిరే ఒప్పందాలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

## 'మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా - మేడ్ ఫర్ ది వరల్డ్'.. ఇదే మా ధ్యేయం: నారా లోకేష్

అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**యువగళం యాత్రే స్ఫూర్తి** తన యువగళం పాదయాత్రే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి స్ఫూర్తినిచ్చిందని లోకేష్ వివరించారు. "3132 కిలోమీటర్ల పాదయాత్రలో ఎందరో ప్రజల కష్టసుఖాలు చూశాను. పెనుగొండలో కియా అనుబంధ సంస్థలో పనిచేస్తున్న పద్మావతి అనే సోదరి తన అనుభవాన్ని పంచుకుంది. కియా రాకముందు గృహిణిగా ఉన్న ఆమె, పరిశ్రమ వచ్చాక ఉద్యోగంలో చేరి నెలకు రూ.30 వేలు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆమె కథ విన్నాక ఉద్యోగ కల్పన ప్రాధాన్యం నాకు మరింత అర్థమైంది. ఆ ఆలోచన నుంచే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం పుట్టింది" అని లోకేష్ పేర్కొన్నారు.

**పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్** గడిచిన 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని మంత్రి తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. ఇప్పటివరకు 800 ప్రాజెక్టుల ద్వారా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదిరాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రూ.1.35 లక్షల కోట్ల చొప్పున పెట్టుబడులతో ముందుకొచ్చాయి. వాటికి శంకుస్థాపనలు కూడా జరిగాయి. రాయల్ ఎన్ఫీల్డ్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలతో పాటు పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ కేంద్రం 'సావీజా' ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి రాబోతోంది" అని వెల్లడించారు. ఒక పెద్ద పెట్టుబడి వస్తే దాని చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు ఎలా వస్తాయో వివరిస్తూ 'మల్టిప్లయర్ ఎఫెక్ట్' గురించి లోకేష్ మాట్లాడారు. "విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కారణంగా, దానికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్ సరఫరా కోసం క్యారియర్ కంపెనీ శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇదే మల్టిప్లయర్ ఎఫెక్ట్," అని ఆయన వివరించారు.

# విపక్షనేతల అంటే లెక్కలేదా ?

మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు

## హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# పల్లెలకు లెక్చరర్ల పరుగులు కానరాని ప్రిన్సిపల్





**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 22:** పల్లె ప్రాంతాల వైపు లెక్చరర్ల బృందం పరుగులు తీస్తూ ఉంది. కళాశాలలో కొత్త అడ్మిషన్ల కొరకు గాను లెక్చరర్లు మండుటెండను సైతం లెక్కచేయకుండా గ్రామాలను సందర్శించి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేరాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలోను సకల సౌకర్యాలు ఉన్నాయని బండి ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు పేర్కొంటున్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులైన తర్వాత వచ్చే విద్యా సంవత్సరం సందర్భంలో బండి ఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కొత్త అడ్మిషన్లు కొరకు గాను గ్రామాలలో కళాశాల లెక్చరర్లు పర్యటించి విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నారు. బుధవారం కళాశాల లెక్చరర్లు డాక్టర్ జివి రఘునాథ్ రెడ్డి, శివరామకృష్ణ చారి,సురేష్,ప్రసాద్, బాబా ఫక్రుద్దీన్ తదితరులు గత రెండు రోజుల నుండి గ్రామాలలో పర్యటిస్తున్నారు ఎర్రగుంట్ల, కరిమద్దెల నారాయణపురం, బరకల కాలనీ, చిన్నదేవళా పురం,గాలి చెన్నయ్యపాలెం, లింగాపురం గ్రామాలలో లెక్చరర్లు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యకు, సత్ప్రవర్తనకు,క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అన్ని పోటీ పరీక్షలకు సంబంధించి న పుస్తకాలతో కూడిన గ్రంథాలయ సౌకర్యం ఉందని చెప్పారు. పూర్తిస్థాయిలో పరికరాలతో కూడిన ప్రయోగశాల సౌకర్యం ఉందని తెలిపారు. వర్చువల్ ల్యాబ్ తో పాటు డిజిటల్ క్లాసులతో విద్యాబోధన జరుగుతుందని అన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన సౌకర్యంతో పాటు, తల్లికి వందనం పథకం ద్వారా 15 వేల రూపాయల సౌకర్యం ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు పురస్కారాలు

అందజేయడంతో పాటు, మలబార్ జ్యువెలర్స్ ద్వారా స్కాలర్షిప్పులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కళాశాలలో చేరి ఉన్నత విద్యను పొందాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచిస్తున్నామని కళాశాల లెక్చరర్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం కనపరుస్తున్నారని వారిలో మంచి స్పందన కనిపిస్తూ ఉందని పేర్కొంటున్నారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలను గురించి ప్రజలకు తెలియజేస్తూ కళాశాల బృందం కరపత్రాలను పంపిణీ చేస్తూ ఉన్నారు. అయితే కళాశాల బృందం గ్రామాలలో తిరుగుతున్నప్పటికీ సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ ఒక గ్రామంలో కూడా పాల్గొనకపోవడం విచారించదగ్గ విషయం.

# వాట్సాప్ ద్వారా శ్రీ మద్దులేటి నరసింహ స్వామి దేవస్థానంలో భక్తులకు ఆలయ సేవలు.





**బేతంచెర్ల మే 13 ( నందిపత్రిక ).** రామాంజనేయులు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము మరియు దేవాదాయ శాఖ ఉన్నతఅధికారుల ఆదేశాల మేరకు శ్రీమద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం భక్తుల సౌఖర్యార్థం నూతనంగా "మన మిత్ర" వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ మరియు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు బుధవారం తెలిపారు. సాంతికతను జోడించి భక్తులకు మరింత పారదర్శకంగా, వేగంగా సేవలను అందించుటకు ఈ "మనమిత్ర" వాట్సాప్ సేవ ఉద్దేశ్యమని ఉపకమిషనర్ తెలిపారు. ఈ సేవ ద్వారా భక్తులు తమ మొబైల్ నుంచే దర్శన సదుపాయాలు, అర్జిత సేవలు, లడ్డు ప్రసాదములు, వసతి సౌఖర్యాలు, విరాళాల సమాచారన్ని మరియు సేవలను పొంద వచ్చునని ఆయన తెలిపారు.సుదూర ప్రాంతాలనుండి వచ్చే భక్తులు ముందస్తుగా దర్శనము మరియు సేవల వివరాలు తెలుసు కుని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకోవాలయునని ఉప కమిషనర్ & దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు కోరారు. భక్తుల సౌఖర్యార్థం అమలు చేస్తున్న ఈ డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొనవలయునని తెలియజేశారు.

# వేగవంతంగా రూరల్ క్లినిక్ నిర్మాణపు పనులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 13:** బండి ఆత్మకూరులో రూరల్ క్లినిక్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రూరల్ క్లినిక్ భవనం ఏర్పాటుకుగాను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 36 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఈ నిర్మాణపు పనులను పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్రాముడు బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల విషయంలో జాగ్రత్త వహించి పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ చైతన్యకు ఆయన సూచనలు ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలను పాటించి పనులను చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పవన నిర్మాణానికి సంబంధించి పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారు. రూరల్ క్లినిక్లలో సాధారణ జ్వరం,జలుబు, దగ్గు వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తారు. గర్భిణీలకు పరీక్షలు టీకాలు పోషకాహార సూచనలు అందిస్తారు. ఆరోగ్య పరీక్షలకు సంబంధించి రక్తపోటు షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తారు. ఉచితంగా మందులను పంపిణీ చేస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు రైతులకు వెనుకబడిన వర్గాలకు వైద్య సేవలను అందించేందుకుగాను ఈ రూరల్ క్లినిక్కును నిర్మిస్తున్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సాహో ఫౌండేషన్ ఘన సత్కారం






**మర్రిపాడు మే 13నంది పత్రిక :** పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మర్రిపాడు మండలంలో 550 పైన మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులను,వారి తల్లిదండ్రులను,ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సాహో ఫౌండేషన్ మర్రిపాడు వారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీ రావు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలియజేయడం మంచి కార్యక్రమమనీ,ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సాహో ఫౌండేషన్ వారికి,అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు,ప్రధానోపాధ్యాయులకు, తల్లిదండ్రులకు,మండల విద్యాశాఖ అధికారులకు అభినందనలు తెలియజేశారు.సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు,నిష్ బిట్ సాఫ్ట్ వేర్ కంపెనీ అధినేత పడచల నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే ఆయుధం చదువు మాత్రమేనని,విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు.ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగాధర్ రావు యిచ్చిన స్ఫూర్తిదాయకమైన సందేశం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది.అనంతరం మర్రిపాడు మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.జిల్లా విద్యాశాఖ అధికారి వారి ఆధ్వర్యంలో మర్రిపాడు ఎస్సీ కాలనీ నందు ఒకటవ తరగతి మరియు ఆరవ తరగతిలో చేరబోయే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని వివరించి ప్రభుత్వ పాఠశాలలో చేరవలసిందిగా విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో చివరగా విద్యాశాఖ అధికారులు,అతిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు అందరూ కలిసి సాహో ఫౌండేషన్ ఏర్పాటు చేసిన విందు భోజనంలో పాల్గొనారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డివిజనల్ విద్యాశాఖ అధికారి జానకిరామ్,మండల విద్యాశాఖాధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి,మర్రిపాడు సబ్ ఇన్స్పెక్టర్ కాసుల శ్రీనివాసులు, నందవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ,ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్,పద్మలత, వేణుగోపాల్ మస్తాన్,మారుతి కేశవరెడ్డి,శ్రీనివాసులు,విజయ భాస్కర్,జి.శ్రీనివాసులు,విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా లీకేజ్ కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

**విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం**

**ఎన్ టి ఏ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలి**

**పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు రఫీ**



**నంద్యాల ప్రతినిధి. మే 13 . (నంది పత్రిక ):**దేశవ్యాప్తంగా మే 3 వ తేదీన జరిగినటువంటి నీట్ ప్రవేశ పరీక్షలలో 20 లక్షలకు పైగా రాశారు నిన్న పేపర్ లీకేజ్ జరిగిందని పరీక్షను రద్దు చేయడం జరిగింది. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు రఫీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేద మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు పైగా ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యను పూర్తి చేసుకొని నీట్ ప్రవేశ పరీక్ష ప్రిపేర్ అయ్యి పరీక్ష రాస్తే ఇప్పుడు పరీక్ష పేపర్ లీకేజ్ అయిందని నీటి పరీక్షను రద్దు చేయడం జరిగిందన్నారు.నీటి ప్రవేశ పరీక్షకు విద్యార్థులు అప్లై చేసుకుని చాలా రోజుల నుంచి ప్రిపేర్ అయ్యి వివిధ జిల్లాల నుంచి వివిధ జిల్లాలకు పోయి పరీక్ష రాస్తే ఈరోజు పేపర్ లీకేజ్ అయిందని రద్దు చేశారు.విద్యార్థుల సమయాన్ని కేంద్ర ప్రభుత్వం వృధా చేయడమే కాకుండా వాళ్ళ ఆశలను పోయే విధంగా చేసిందని మండిపడ్డారు. గత సంవత్సరం కూడా ఇదే తరహాలో హర్యానా బీహార్ రాష్ట్రాలలో నీట్ పరీక్ష పేపర్ను 30 లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు అమ్ముకొని లీకేజ్ చేశారని గుర్తు చేశారు.మరి ఈ సంవత్సరం కూడా అదే తరహాలోనే డబ్బులకు నీట్ పేపర్ను అమ్ముతున్నారని మండిపడ్డారు చాలామంది విద్యార్థులు బాగా చదువుకొని నీట్ ప్రవేశ పరీక్షలో సీటు కొట్టాలన్న ఆశతో పరీక్ష రాస్తే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేపర్ ను లీకేజ్ చేయడం జరిగిందన్నారు దానివల్ల విద్యార్థుల జీవితాలు తీవ్రంగా నష్టపోతాయని కేంద్ర ప్రభుత్వం పైన మండిపడ్డారు ఎన్ టి ఏ ఏజెన్సీ ద్వారా నీటి ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహిస్తా ఉంది.ఈ కొన్ని సంవత్సరాలలోనే రెండుసార్లు లీకేజ్ కావడం కేంద్ర ప్రభుత్వం నీటి ప్రవేశ పరీక్ష పైన ఎంత శ్రద్ధ చూపిస్తా ఉందొ అర్థం చేసుకోవాలన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి నీటి ప్రవేశ పరీక్ష లీకేజ్ ఘటన పైన ఇది రెండవసారి జరగడం దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా గతంలో ఏ రాష్ట్రాలకు సంబంధించి ఆ రాష్ట్రాలలో నీటి ప్రవేశ పరీక్ష ఏర్పాటు చేసేవారని గుర్తు చేశారు. ఆ సందర్భంలో ఎప్పుడూ కూడా నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పేపరు లీకేజ్ జరిగింది లేదన్నారు.కానీ కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నీ ప్రవేశ పరీక్షను డబ్బులకు అమ్ముకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని కేంద్ర విద్యా శాఖ నిర్లక్ష్యం వల్లనే ఇలా రెండు సంవత్సరాల లో పేపర్ లీకేజ్ కావడం జరిగిందని తెలిపారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్ టి ఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కర్నూలు సర్వజన ఆసుపత్రి ద్వారా ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలి





**ఆసుపత్రి కి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం**

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూలు సర్వజన ఆసుపత్రి కి కావలసిన అన్ని సౌకర్యాలను సమకూర్చుచున్నామని , ప్రజలకు సంతృప్తికరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త.మంగళవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో మంత్రి భరత్ గుప్త ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్ మరియు సర్వజన ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు విషయాలపై సమీక్షించి సూచనలు జారీ చేశారు. ఈ మధ్య మార్చురీలో డబ్బులు తీసుకుంటున్నారు అన్న విషయం మీడియా ద్వారా తెలిసిందని అన్నారు. ఈ విషయం పై విచారించగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులు మార్చురీలో గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వము నుండి ఎటువంటి జీత భత్యాలు లేకుండా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారని తెలుసుకున్నారు.వెంటనే వారిని ఔట్సోర్సింగ్ లో పారిశుద్ధ కార్మికులుగా తీసుకొని వారికి జీత భత్యాలు చెల్లించి వారు ప్రజల నుండి సొమ్ము వసూలు చేయకుండా చూడాలని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో దాదాపు 400 ఏసీలు ఉండగా అందులో 300 చాలా పాతవి తరచూ రిపేర్లు చేయవలసిన అవసరం ఉన్నదని తెలుసుకున్న మంత్రి దశలవారీగా ఆసుపత్రి నిధులతో క్రొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఏఎంసీ ద్వారా ఏసీలు మరమ్మతులు చేయించుకోవాలని అవసరమైన మేరకు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూపరిండెంట్ను ఆదేశించారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన ఏడు ఆక్సిజన్ ప్లాంట్లను వాడుకులోకి తీసుకుని రావడానికి అవసరమైన ప్రణాళికలు సమర్పించవలసిందిగా ఆదేశించారు.సర్వజన ఆసుపత్రి ఎల్లప్పుడూ పరిశుభ్రముగా ఉండే విధంగా కాంట్రాక్టర్ అధికారులకు సహకరించాలని , అధికారుల సూచనల మేరకు కాంట్రాక్టర్ సిబ్బందిని నియమించి ప్రజల నుండి ఐ విఆర్ఎస్ ద్వారా మంచి ఫీడ్బ్యాక్ వచ్చే విధంగా చర్యలు ఉండాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.నర్సింగ్ సిబ్బంది యొక్క సేవలను సున్నితమైన ప్రదేశాల్లో ఇబ్బంది కలగకుండా స్వల్ప మార్పులు చేర్పులు చేసుకుని వారి ద్వారా రోగుల కు మంచి సేవలు అందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఆసుపత్రికి ఇంకా అవసరమైన వెంటిలేటర్లు , లైఫ్ సపోర్టింగ్ ఎక్విప్మెంట్ , బెడ్లు , ట్రాలీలు మొదలగునవి సమకూర్చుతామని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న జనరేటర్లు ఆటోమేటిక్ గా పనిచేసే విధంగా సమర్థవంతంగా ఉండాలని , 50 సీసీటీవీ ల ద్వారా అన్ని విషయాల పై నిరంతర పర్యవేక్షణ జరుగుతూ ఉండాలని, అన్ని స్కానర్లు ఏఎంసీ వినియోగించుకొని ఎల్లప్పుడు పనిచేస్తూ ఉండాలని ఆదేశించారు.1956 సంవత్సరంలో నిర్మించిన శు శ్రుత భవన ములో అందించే వైద్య సేవలు వీలైనంత త్వరగా ఐపిడి భవనం కు మార్చే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోగుల సహాయకులకు నిర్మించ తలపెట్టిన విశ్రాం సదన్ త్వరగా కార్యరూపం దాల్చే చర్యలు తీసుకోవాలని , ఆసుపత్రిలో పేరుకుపోయిన కాలం చెల్లిన మందులు వెంటనే తరలించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించే విషయాలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని అధికారులను కోరారు. ప్రజలకు సంతృప్తికరమైన మంచి వైద్య సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని మంత్రి భరత్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ , జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ నాగేశ్వరరావు ,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి , అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం , హాస్పిటల్ డెవోలోప్ కమిటీ మెంబర్ లు డాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్ , స్టేట్ క్యాన్సర్ యూనిట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ , ఏపీఎంఐడిసి ఈ ఈ చిరంజీవులు, డిఎంహెచ్వో కామేశ్వర ప్రసాద్ , డెప్యూటీ భాస్కర్ , జిల్లా సర్వైవలెన్స్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి , ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ భాస్కర్ రెడ్డి , డి ఐ ఓ డాక్టర్ ఉమా,డాక్టర్ లు శివబాల, కిరణ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ,ధ్వజస్వంభంపై మేఖలాలు పునఃప్రతిష్ఠ



**మహానంది మే 13 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో వైభవంగా నూతన ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్వంభంపై మేఖలాలు పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.శివ కోదండ రామాలయంలో 3 వరోజు బుధవారం పూజా కార్యక్రమాలలో భాగంగా రుత్వికులు రామ్మూర్తి శర్మ, రామశర్మ, భోగేంద్ర శయన్ శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ ఈశ్వర స్వామివారికి,యంత్రానికి అభిషేకార్చనలు,యంత్ర ప్రతిష్ట,విగ్రహ ప్రతిష్ఠ,మేఖలాల ప్రతిష్ట,కూష్మాండ బలి, హారతి, కలశ మార్జినం నిర్వహించారు.గ్రామ ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఎర్రగుంట్ల హరిబాబు,కళావతి దంపతులు, పోలిశెట్టి సురేంద్ర,భూలక్ష్మి దంపతులు, కదిరి సాయి , దివ్య దంపతులు, ఉల్లి మధు, మధుమణి దంపతులు, ఆర్ఎస్ఎస్ ప్రముఖ లక్కాకుల చిన్న కాశయ్య,తదితరులు పాల్గొన్నారు.



## సమీకృత పంటల నిర్వహణపై అవగాహన



**చాగలమర్రి మే 13నంది పత్రిక** రాబోవు ఖరీఫ్ సీజన్ లో ఎల్ నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటల సాగు కష్టతరమవుతుందని రైతులందరూ తప్పనిసరిగా సమీకృత పంటల నిర్వహణ పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగా నేతాజీ తెలిపారు. బుధవారం పెద్ద వంగలి గ్రామంలో సమతుల్య ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాలలో తెలియజేసిన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా వ్యవసాయంలో లాభాలను పొందడమే గాక, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. వివిధ రకాల యాజమాన్య పద్ధతులైన సస్యరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి, సమగ్ర కలుపు నివారణ పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు అని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా పురుగు అవశేషాలు లేని సురక్షితమైన ఆహారం రైతులు వినియోగదారులకు అందించవచ్చని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిస్పోస్ చేయడం పై ప్రత్యేక దృష్టి సారించండి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మున్సిపాల్టీ లో, నగర పంచాయతీ లో, గ్రామ పంచాయతీ లో సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిస్పోస్ చేయడం పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్ లను, డిపిఓ ను ఆదేశించారు.బుధవారం కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ సెక్రటరీ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అంశం పై అన్ని రాష్ట్రాల కలెక్టర్ లతో, మున్సిపల్ కమిషనర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాల్టీ లో, నగర పంచాయతీ లో, గ్రామ పంచాయతీ లో ఉత్పత్తి అయ్యే చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజ్ చేయాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా, ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం అవసరమైన ఇంకుడు గుంతలు, డ్రైనేజీ వ్యవస్థలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులు పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశుభ్రమైన జిల్లానే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు..వీడియో కాన్ఫరెన్స్ లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈఓ రమణ రెడ్డి, డిపిఓ భాస్కర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.వెంకట కిషోర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నదుల స్వచ్ఛత ప్రజలందరి బాధ్యత





### కె.సి. కెనాల్ శుభ్రతపై కమిషనర్ సంతృప్తి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగర పరిధిలో ఉన్న నదులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం కె.సి. కెనాల్ ఇరువైపులా పరిసరాలను పరిశీలించిన ఆయన, మంగళవారం ఇచ్చిన ఆదేశాల మేరకు చేపట్టిన శుభ్రత పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన పరిశుభ్రత కోసం చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అపరిశుభ్రం చేయకుండా ఉండేందుకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అంతకుముందు 10వ డివిజన్లో మస్టర్ తనిఖీ నిర్వహించి, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. జొహరపురం రోడ్డులోని ఇండోర్ స్టేడియం, మాస్టర్ & బ్లాస్టర్ క్రికెట్ స్టేడియంను సందర్శించి స్వచ్ఛత పనులను చేపట్టాలని ఆదేశించారు. అలాగే గార్బేజ్ ట్రాన్స్పోర్ట్ పాయింట్ నిర్మాణం, ఈ-ఆటోస్ పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. సి.క్యాంపు సమీపంలోని సుద్దవాగు పక్కన ఉన్న నగరపాలక సంస్థ స్థలాన్ని సందర్శించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ను పరిశీలించి, అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ఏ.క్యాంపులో రహదారి విస్తరణ కోసం అటవీ శాఖ తొలగించిన మొక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరితగతిన రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎస్ఈ రమణమూర్తి, ఏఈ జనార్ధన్, రాంమోహన్, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు రమేష్, జిలానీ, హుస్సేన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు





### నెలాఖరుకు 500 గృహాల కేటాయింపు

### రెండు నెలల్లో ఇంటింటికి నీటి సరఫరా

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగర శివార్లలో టిడ్కో గృహాల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం ఆయన టిడ్కో, మున్సిపల్ అధికారులతో కలిసి టిడ్కో గృహాలను పరిశీలించారు. అక్కడి వసతులు, సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. టిడ్కో గృహాల నిర్మాణ స్థితిగతులు, తాగునీటి సరఫరా పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాల్లో వారంలో 2 సార్లు నీటి సరఫరా చేయడం జరుగుతుందని, విద్యుత్ దీపాలకు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. రేషన్ బియ్యం సరఫరా, సచివాలయం, బస్ సౌకర్యం, ప్రాథమిక పాఠశాల వంటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ నెలాఖరుకు 500 గృహాలు అందుబాటులోకి వస్తాయని, రెండు నెలల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా పనులు పూర్తి అవుతాయన్నారు. కావున టిడ్కో గృహాలు పొందిన వారు వెంటనే చేరాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, టిడ్కో ఎస్ఈ పి.వి. శేషసాయి,

ఎంఈ సూర్యనారాయణ, ఏఈ జనార్ధన్, టిడ్కో అధికారులు పెంచలయ్య, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రజలకు పొదుపు గురించి చెప్పడం మంచిదే కానీ ప్రజలు బ్రతికేదెలా



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** దేశ ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో జీవనోపాధి కొనసాగించుకుంటూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన "బంగారం కొనొద్దు, ఆయిల్ కొనొద్దు, దుబారా ఖర్చులు చేయొద్దు" అనే వ్యాఖ్యలు సమాజంలోని అనేక వర్గాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నేను బంగారు రంగంలో ఎన్నోసంవత్సరాలుగా పని చేస్తున్న ఒక సాధారణ వర్కర్గా కూడా ఈ విషయాన్ని చెబుతున్నాను. నాకు బంగారం పని తెలుసు, బంగారు సాగు కూడా ఉంది. ఈ రంగంలో ఒక ఆర్ట్, ఒక రోజువారీ వ్యాపారం ఆధారంగా ఎంతోమంది కుటుంబాలు జీవిస్తున్నారని నాకు ప్రత్యక్షంగా తెలుసు. బంగారం వ్యాపారం అనేది కేవలం షాపుల మాత్రమే కాదు ఇందులో బంగారు పనివాళ్లు, కార్మికులు, డిజైన్ తయారు చేసే కళాకారులు, పాలిష్ చేసే వారు, చిన్న చిన్న వర్క్ షాపులు, ఫైనాన్స్ మీద పని చేసే కుటుంబాలు, దుకాణాల్లో పని చేసే ఉద్యోగులు ఇలా వేలాది మంది జీవనోపాధి ఆధారపడి ఉంది. అలాగే ఆయిల్ కొనొద్దు, ఖర్చులు తగ్గించండి అనే వ్యాఖ్యలు చిన్న హోటల్స్, స్వీట్ షాపులు, ట్రాన్స్పోర్ట్ రంగం, రైతులు, కూలీలు మరియు రోజువారీ ఆదాయం మీద ఆధారపడి జీవించే పేద మధ్యతరగతి కుటుంబాలపై కూడా ప్రభావం చూపుతాయి. ప్రజలు ఖర్చు చేయకపోతే మార్కెట్లో డబ్బు చలామణి తగ్గిపోతుంది. వ్యాపారాలు మూతపడే పరిస్థితి వస్తుంది. దాని ఫలితంగా నిరుద్యోగం పెరిగి అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుంది.

దేశ ప్రజలకు పొదుపు గురించి చెప్పడం మంచిదే కానీడ అదే సమయంలో చిన్న వ్యాపారులు, కార్మికులు, వర్ధన్న వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి కూడా సమతుల్యంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ బలపడాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి, చిన్న వ్యాపారాలు నిలబడాలి, కార్మికులకు పని ఉండాలి. ప్రభుత్వం ప్రజల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని, చిన్న వ్యాపారులు మరియు వర్ధక రంగ భవిష్యత్తును కాపాడాలని ఖాజా హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోంది

### జిల్లా ఐ యన్ టి యు సి నాయకులు

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నీట్ (నీట్ ) పరీక్ష పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని జిల్లా ఐ యన్ టి యు సి నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఐ ఎన్ టి యు సి నాయకులు మాట్లాడుతూ, వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులు దేశ విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు బి బతుకన్న మాట్లాడుతూ, విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ వైఫల్యం కారణంగా వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందన్నారు. ముఖ్యంగా ఇలాంటి ఘటనలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లోనే తరచూ జరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. సిటీ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మాట్లాడుతూ, గతంలో కూడా నీట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్, పేపర్ లీక్ ఘటనలు చోటు చేసుకున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు సంబంధిత శాఖ మంత్రులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసేవారని, కానీ ప్రస్తుతం ఉన్న పాలకులు కనీసం ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొంటూ, సంబంధిత కేంద్ర మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, అలాగే ఈ వ్యవహారంలో విఫలమైన రాజస్థాన్ ముఖ్యమంత్రి కూడా నైతిక బాధ్యత తీసుకుని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై




సీబీఐ లేదా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు జరిపి, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్టియుసి నాయకులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షా నిర్వహణలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.దేశ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకుని, విద్యా వ్యవస్థ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి అనంత రాజేంద్రప్రసాద్, పేపర్ మిల్లు సీనియర్ ఐ ఎన్ టి యు సి నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతితోనే బీటెక్‌కు మార్గం
## ఏపీ ట్రిపుల్ ఐటీ ప్రవేశాల నోటిఫికేషన్



**పోరుమామిళ్ల, మే 13 (నంది పత్రిక):** లక్షల మంది విద్యార్థుల కల బీటెక్. సాధారణంగా 10వ తరగతి తర్వాత ఇంటర్ ఎంపీసీ, ఆపై జేఈఈ మెయిన్, అడ్వాన్స్డ్, ఈఏపీ సెట్ వంటి ఎంట్రన్స్‌లు రాసి బీటెక్‌లో చేరతారు. కానీ 10వ తరగతి మార్కుల ఆధారంగానే నేరుగా బీటెక్‌లో చేరే అవకాశాన్ని ఏపీ ట్రిపుల్ ఐటీలు కల్పిస్తున్నాయి. తాజాగా 2026-27 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఏపీ ట్రిపుల్ ఐటీల ప్రత్యేకత: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మానస పుత్రికలుగా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)ను ఏర్పాటు చేశారు. నాలుగు క్యాంపస్‌లు 4400 సీట్లు: ప్రస్తుతం ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ), నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలో క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రతి క్యాంపస్‌లో 1100 చొప్పున మొత్తం 4400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి క్యాంపస్‌లో 10% సీట్లు ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు కేటాయించారు. అర్హతలు: 2026 మే నాటికి పదవ తరగతి లేదా తత్సమాన కోర్సు మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణులై ఉండాలి. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు: 10వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారు సాధించిన మార్కులకు అదనంగా 4 మార్కులు 'డిప్రైవేషన్ స్కోర్' కింద కలుపుతారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలోనే నిర్దేశిత సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. అప్‌లోడ్ చేయాల్సిన సర్టిఫికెట్లు: 10వ తరగతి హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఎన్సీసీ, పీహెచ్, సీఏపీ కేటగిరీ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, లోకల్ కేటగిరీ కోసం రెసిడెన్స్ సర్టిఫికెట్.

**పియుసి ప్లస్ బీటెక్ 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు:** – మొదటి రెండేళ్లు పియుసి: ఇంటర్మీడియట్‌కు తత్సమానం. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు, ఐటీ బోధిస్తారు. బయాలజీ ఆప్షనల్‌గా తీసుకుంటే భవిష్యత్తులో నీట్‌కు అర్హత ఉంటుంది. – మూడో ఏడాది నుండి బీటెక్: కెమికల్, సివిల్, సీఎస్ఈ ( ఏ ఐ – ఎం ఎల్ స్పెషలైజేషన్), ఈసీఈ, మెటలర్జికల్ & మెటీరియల్స్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. పియుసి మార్కుల ఆధారంగా బ్రాంచ్ కేటాయిస్తారు. పియుసితో ఎగ్జిట్ అవకాశం: రెండేళ్ల పియుసి పూర్తయ్యాక జేఈఈ, నీట్ యూజీ రాసి ఐఐటీలు, ఎన్ఐటీలు, మెడికల్ కళాశాలల్లో చేరేందుకు పియుసి సర్టిఫికెట్ ఇస్తారు. ఇంటర్న్‌షిప్ & స్కాలర్‌షిప్: ఇరిగేషన్, ఆర్&బీ, ఎలక్ట్రికల్ వంటి ప్రభుత్వ శాఖల్లో, ప్రైవేట్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల లోపు ఉన్నవారికి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్: పలు ఎంఎన్‌సీలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించి ఆకర్షణీయ వేతనాలతో ఆఫర్లు ఇస్తున్నాయి. యూపీఎస్సీ ఈఎస్ఈతో పాటు గేట్, పీజీఈసెట్‌లలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతున్నారు.

**ముఖ్య తేదీలు :** – ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2026 మే 30
– స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్ వెరిఫికేషన్: జూన్ 5 నుంచి 8 వరకు
– జనరల్ కేటగిరీ (నూజివీడు & ఆర్కే వ్యాలీ): జూన్ 19, 20
– ఒంగోలు & శ్రీకాకుళం: జూన్ 22, 23

**వెబ్‌సైట్:** . ఆర్ జి యు కె టి . ఇన్ యబొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల, కడప జిల్లా

## ఖరీఫ్ రైతులకు శుభవార్త..
## పంటల కనీస మద్దతు ధరలు పెంపు

- రైతుల ఆదాయం పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు



**అమరావతి, బ్యూరో చీఫ్ మే 13:నంది పత్రిక** దేశ రైతాంగ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు ( ఎం ఎస్ పి ) రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయమని ఆయన అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఖరీఫ్ పంటల ఎం ఎస్ పి పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల 60 వేల కోట్ల భారీ వ్యయాన్ని ఆమోదించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పెట్టుబడి ఖర్చుకు కనీసం 50 శాతం లాభం జోడించి ఎం ఎస్ పి ధరలు నిర్ణయించడం రైతులకు నిజమైన భరోసా కల్పించే చర్యగా అభివర్ణించారు. రైతు కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతోనే పలు పంటల ఎం ఎస్ పి లను గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. వరి కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.72 పెంచి రూ.2441, గ్రేడ్-ఏ వరికి రూ.2461 నిర్ణయించడం రైతులకు లాభదాయకమని తెలిపారు. జొన్నకు రూ.4073, రాగికి రూ.5205, సజ్జలకు రూ.2900, ఉలవలకు రూ.8200, మొక్కజొన్నకు రూ.2410, నువ్వులకు రూ.10,346, సన్‌ఫ్లవర్‌కు రూ.8343, పత్తికి రూ.8667, వేరుశనగకు రూ.7517 వరకు ఎం ఎస్ పి పెంపు ప్రకటించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న వ్యయభారం, ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రాష్ట్రంలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎం ఎస్ పి లను పూర్తిస్థాయిలో పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ వ్యవస్థ, మద్దతు ధర అమలు ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు రాష్ట్ర రైతుల తరపున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రాయలసీమ యూనివర్సిటీ ఖజానాను కాజేస్తున్న రిజిస్ట్రార్ ను తొలగించాలి.

**రాయలసీమ యూనివర్సిటీ లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపించాలి.**
**ప్రభుత్వం దృష్టికి తీసుకొని వర్సిటీకి న్యాయం చేయండి.**
**ఏఐఎస్ఎఫ్,పిడిఎస్ యు, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్ కు వినతి పత్రం అందజేత.**
**విజిలెన్స్ శాఖతో సమగ్రంగా విచారణ జరిపించి,చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ.**
**రిజిస్ట్రార్ తొలగించే వరకు పోరాటాలు కొనసాగిస్తాం.**
**ఏఐఎస్ఎఫ్,పీడీఎస్ యూ, ఏఐఎస్ఏ నాయకులు వెల్లడి.**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**రాయలసీమ యూనివర్సిటీ ఖజానాకు కన్నం వేసిన రిజిస్ట్రార్ ను తక్షణమే తొలగించి, యూనివర్సిటీలో జరిగిన అవినీతి,అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్,పీడీఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రమణ,ఏఐఎస్ఏ నాయకులు పవన్ లు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్,పీడీఎస్ యూ, ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ను కలిసి, యూనివర్సిటీ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ అవినీతికి అడ్డగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనా పేరుతో వర్సిటీకి వచ్చిన రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రతి పనికి వాటా అంటూ, ప్రభుత్వం వర్సిటీ కేటాయించిన నిధులు దుర్వినియోగం చేస్తూ, వాటిని సొంత ఖాతాలకు మళ్లించుకుంటూ ధనార్జనే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీ అభివృద్ధి కొరకు కేటాయించే రూసా నిధులను కూడా కొల్లగొడుతూ, అనవసరమైన వాటికి ఉపయోగించి, కొన్ని సందర్భాల్లో జరగని పనులకు కూడా బిల్లులు చేసుకొని, సొమ్ములు చేసుకుంటున్నారని ఆరోపించారు. కాన్వకేషన్ పేరుతో కోట్లాది రూపాయలను కాజేశారని, నిబంధనల ప్రకారం కాన్వకేషన్ పేరుతో చేసిన ఖర్చులను బహిర్గతం చేయాలనేటువంటి నిబంధనను పక్కన పెట్టి, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రహస్యంగా దాచడం వెనక అనేక అనుమానాలకు తావుతీస్తుందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లో కూడా అనేక అక్రమాలకు తెరలేపి, అనుకూలంగా ఉన్న వారికే కాంట్రాక్టులు ఇస్తున్నారని అన్నారు.

కమిటీలలో ఆయనకు వత్తాసు పలికే వారికే ప్రాధాన్యత ఇచ్చి, ఇష్టానురాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ప్రస్తుత రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత యూనివర్సిటీ యొక్క పరువు ప్రతిష్టలను, ప్రైవేట్ వ్యక్తులు మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలకు తాకట్టు పెట్టడం జరుగుతుందని అసహనం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ యొక్క ఆత్మగౌరవం, యూనివర్సిటీ విద్యార్థుల యొక్క ఆత్మాభిమానం కు బంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రిజిస్ట్రార్ తీరుపై వీసీ కి పలుమార్లు ఫిర్యాదు చేసిన, ఫలితం శూన్యమని, పక్కాగా రిజిస్ట్రార్ దోపిడీకి సహకరిస్తున్నారని అన్నారు. యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలను,పరిస్థితులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, మంత్రి ని కోరారు. ఈ విషయంపై మంత్రి టీజీ భరత్ సానుకూలంగా స్పందిస్తూ యూనివర్సిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ శాఖతో సమగ్రంగా విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

# రొయ్యల ఫీడ్ ధరల పెంపు నిలిపివేత..
## మంత్రి అచ్చెన్నాయుడు జోక్యంతో కీలక నిర్ణయం

- రైతుల కష్టాలపై వ్యాపారం చేయొద్దు : ఫీడ్ కంపెనీలకు మంత్రి గట్టి హెచ్చరిక
- ఏకపక్ష ధరల పెంపు అంగీకరించం
- రైతుల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,బ్యూరో చీఫ్ మే 13:నంది పత్రిక** ఆక్వా రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నీ కూటమి ప్రభుత్వం సహించదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలను ఒక్కసారిగా పెంచడం వల్ల రాష్ట్రంలోని వేలాది ఆక్వా రైతులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాలు, అధికారులతో బుధవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందిస్తూ, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ధరలు పెంచడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో రైతులపై అదనపు భారం మోపే చర్యలు తీసుకుంటే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలు కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో ష్రిమ్ప్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందిస్తూ, పెంచిన ఫీడ్ ధరల అమలును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. ముడి పదార్థాల ధరలు నిరంతరం పెరుగుతున్న కారణంగా ఫీడ్ ధరల సవరణపై ఆలోచించాల్సి వచ్చిందని అసోసియేషన్ పేర్కొన్నప్పటికీ, మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు, మార్గదర్శకాలను గౌరవిస్తూ ధరల పెంపును వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, అధికారులు పాల్గొనే ఉమ్మడి సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అందరి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని రైతులకు నష్టం కలగకుండా, పరిశ్రమ కూడా కొనసాగగలిగే విధంగా పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఏపీఎస్ఎడియే కో-వైస్ చైర్మన్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మత్స్యశాఖ కమిషనర్‌తో పాటు ఎస్ఐఎఫ్టి, సిఐబీఏ, సిఐఎఫ్ఏ, సిఐఎఫ్టి, మత్స్య విశ్వవిద్యాలయం ప్రతినిధులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణ,




**ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం,**
**ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యం.**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** జిల్లాలోని ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష సమావేశం లో రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, వైద్యశాఖ, మునిసిపల్, ఎన్.హెచ్ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన భద్రత చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వివరాలు, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలు, ప్రమాద ప్రాంతాల గుర్తింపు, ట్రాఫిక్ నియమాల అమలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులు పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మైనర్ లు డ్రైవింగ్‌ను అరికట్టాలని అన్నారు. పాఠశాలలు మరియు కళాశాలల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు కొట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాల ఏర్పాటు వంటి చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా వినూత్నమైన ఆలోచనలతో అధికారులు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాల గణాంకాలను నెలవారి సమీక్షించి, ప్రమాదాలకు గల కారణాలపై విస్తృతంగా చర్చించారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం, సెల్ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవ్ చేయడం, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్ల మలుపు ప్రాంతాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో పార్కింగ్ ప్రదేశాలు నిర్దేశించాలన్నారు. జిల్లాలో ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు వినూత్నమైన ఆలోచనలతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. మైనర్ లు ఎవరు కూడా వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోవద్దని తెలిపారు.. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, భీమవరం ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ అదనపు కమిషనర్ రాంబాబు, డి టి ఓ కె ఎస్ ఎం ఎన్ కృష్ణారావు, తణుకు ఎం వి ఐ ఎస్.శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం డిఎస్పి ధర్మవరపు విశ్వనాథం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని గీతా భాయ్, పోలీసు శాఖ, రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..



# వ్యవసాయ రంగంలో రసాయన వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

## బయో ఫర్టిలైజర్ల వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు మరియు బయో ఫర్టిలైజర్ల వినియోగాన్ని పెంపొందించే దిశగా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం భీమవరంలోని వశిష్ఠ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, పారిశ్రామిక, పోలీసు శాఖల అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన “డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ ఆన్ ఫర్టిలైజర్స్” సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువుల లభ్యత, నిల్వలు, పంపిణీ విధానం, నాణ్యత నియంత్రణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఖరీఫ్కు అవసరమైన యూరియా, డీఏపీ, పొటాష్ తదితర ఎరువులు జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులకు సరైన అవగాహన కల్పిస్తూ, పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. గత రబీ సీజన్లో సుమారు 2000 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువుల వినియోగం తగ్గిందని, రాబోయే ఖరీఫ్లో మరింతగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.



జిల్లాలో ఎరువుల సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్కు సంబంధించిన ఎరువుల నిల్వలు, అవసరాలు, సరఫరా వివరాలను పోర్టల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఎరువుల అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, బ్లాక్ మార్కెటింగ్, నకిలీ ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే పోలీసు శాఖ సహకారంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల్లో తగిన ఎరువుల నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఆధార్ ఆధారిత పాయింట్ ఆఫ్ సేల్ ( పి ఓ ఎస్ ) విధానంలోనే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే ఎరువుల దుకాణాల్లో ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయాలు జరగాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి లక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువులు మరియు పురుగుమందుల కంపెనీల ప్రతినిధులు, ఫెర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో విద్యార్థులు లైబ్రరీలకు వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం:బ్యూరో చీఫ్ మే 13,నంది పత్రిక** కంకిపాడు మండలం, తెన్నేరు గ్రామానికి చెందిన దేవినేని మధుసూదన రావు బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి చేతులు మీదుగా జిల్లాలోని 31 గ్రంథాలయాలకు 6 విభాగాలకు సంబంధించిన మొత్తం 228 పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గ్రంథాలయాలకు అందించిన పుస్తకాలలో బాలల గేయాలు, బతుకు పాటలు, ఎదిగే ఆడపిల్ల ఏమీ తెలుసుకోవాలి, పద్య పారిజాతాలు, మహాత్ముని అడుగు జాడలు, గాంధీ మహాత్ముని దృష్టిలో విద్య, పర్యావరణం పరిశుభ్రత తదితర పుస్తకాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులు, పాఠకులు ప్రతిరోజు లైబ్రరీలకు వెళ్లి ఈ పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించవలసిందిగా అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి ఇటువంటి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. దాతలు ఇచ్చిన పుస్తకాలను లైబ్రరీ రికార్డులలో నమోదు చేసుకొని, పుస్తకాల నిర్వహణ సజావుగా చేసుకోవాలని గ్రంథాలయ సిబ్బందికి తెలియజేశారు. ప్రతి విద్యార్థి వేసవి సెలవులలో తప్పక తమకు దగ్గరలో ఉన్న గ్రంథాలయాలలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరాలకు వెళ్లి ఇటువంటి పుస్తకాలను అభ్యసిస్తే మంచి విజ్ఞానంతో పాటు నడవడిక అలవాటు అవుతుందని అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో 31 గ్రంథాలయ సంస్థలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటువంటి శిబిరాలలో విద్యార్థులు చదువుకుంటే మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు వారి ప్రతిభను కనపరచుకోవచ్చని అన్నారు. వివిధ అంశాలకు సంబంధించి అన్ని పుస్తకాలు లైబ్రరీలో ఒకే చోట లభించటం జరుగుచున్నదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకొని శిబిరాలకు తీసుకురావలసినదిగా కోరారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇటువంటి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు.

# పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులకు సువర్ణావకాశం

## సాంఘిక సంక్షేమ హాస్టల్స్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి

### జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణ్ కుమారి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల జోరుకు తోడుగా, పశ్చిమ గోదావరి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని హాస్టళ్లు సరికొత్త సదుపాయాలతో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణ్ కుమారి అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, భద్రత మరియు సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని అన్ని హాస్టళ్లలో నాణ్యమైన సౌకర్యాలు కల్పించబడుతున్నాయన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 3వ తరగతి నుండి పీజీ వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించబడుతున్నాయి. ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్-మెట్రిక్ హాస్టళ్లలో అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్నారు.

**నాణ్యమైన విద్య కార్పొరేట్ స్థాయి వసతి** విద్యార్థులకు ప్రశాంతమైన చదువుల వాతావరణం, ఆధునిక సదుపాయాలతో కూడిన వసతి కల్పించబడుతోంది. ప్రైవేట్ హాస్టళ్లకు దీటుగా హాస్టళ్లను ఆధునీకరించి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు.




**పౌష్టికాహారానికి ప్రత్యేక ప్రాధాన్యం** ప్రతిరోజూ నిర్ణీత మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయబడుతోంది. వారానికి మూడు రోజులు చికెన్, ఆరు కోడిగుడ్లు అందించబడు తున్నాయని తెలిపారు. అదనంగా ప్రతిరోజూ అరటిపండు, చిక్కీ, రుచికరమైన స్నాక్స్ ఇవ్వబడుతున్నాయని తెలిపారు. అల్పాహారంగా పూరీ, ఉప్మా, ఇడ్లీ, పులిహోర, పొంగల్ వంటి ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫోర్టిఫైడ్ రైస్తో భోజనం అందిస్తున్నారు. అన్ని హాస్టళ్లలో సురక్షితమైన ఆర్.ఓ ప్లాంట్ త్రాగునీటి సదుపాయం కల్పించబడిందన్నారు. ప్రతి విద్యార్థికి ట్రంక్ బాక్స్, వూలెన్ బెడ్ షీట్లు, టవల్, నోట్ బుక్స్, క్రీడా సామగ్రి ఉచితంగా అందజేయబడుతున్నాయన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ బుక్లెట్ మరియు ఎగ్జామ్ కిట్ అందిస్తున్నారు. సబ్బులు, పౌడర్, టూత్ బ్రష్ తదితర వ్యక్తిగత అవసరాల కోసం కాస్మెటిక్ ఛార్జీలు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడుతున్నాయని అన్నారు.

**ఆరోగ్యం భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విద్యార్థులకు క్రమం తప్పకుండా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడుతున్నాయన్నారు. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణతో హాస్టళ్లలో సురక్షితమైన వాతావరణం కల్పించబడుతోందని తెలిపారు. ఇటీవల విడుదలైన ఎస్ ఎస్ సి మరియు ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు రికార్డు స్థాయి మార్కులతో ప్రతిభ కనపర్చారని వెల్లడించారు. ఇదే విజయపథంలో మరింత మంది విద్యార్థులు ముందుకు రావాలని జిల్లా యంత్రాంగం ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సీట్లు అందుబాటులో ఉన్నాయనీ, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చేర్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కోరుచున్నారు..

# నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీలో ఉద్యాన పంటలకు సరైన ధర నిర్ణయించాలి

## నిబంధనలలో లేని పంటలకు జిల్లా కమిటీలో పరిహారం నిర్ణయించాలి

### జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...



**ఏలూరు, బ్యూరో చీఫ్ మే 13:నంది పత్రిక** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ లోని నిర్వాసితులకు ఉద్యాన పంటల పంటలకు నిబంధనల మేరకు ధరలను నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేటు గౌతమీ సమావేశ హాలులో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, రహదారి, తదితర ప్రోజెక్టుల నిమిత్తం భూసేకరణ చేసిన రైతులకు ఉద్యానవన పంటల పరిహారం నిబంధనల మేరకు చెల్లింపులు చేయాలన్నారు. నిబంధనలతో లేని డ్రాగన్ ఫ్రూట్ వంటి కొన్ని ఉద్యానవన పంటలకు అందించాల్సిన పరిహారాన్ని జిల్లా స్థాయి కమిటీలో సభ్యులతో చర్చించి న్యాయమైన రేట్లను నిర్ణయించాలని, రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బుట్టాయిగూడెం మండలం బుట్టాయిగూడెం రైతు నుండి 3.46 ఎకరాలు భూసేకరణ చేయడం జరిగిందని, సదరు భూమిలో రైతు డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్నారని, ప్రభుత్వ నిర్దేశించిన జీవోలో డ్రాగన్ ఫ్రూట్ పంటకు పరిహారం అంశం లేనందున జిల్లా స్థాయి కమిటీ పూర్తి అధ్యయనం చేసి రైతులకు నష్టం జరగకుండా రేటును నిర్ణయించాలని అన్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు ఉన్న అనంతపురం, ప్రకాశం, పల్నాడు జిల్లలలో అక్కడ ఉన్నతాధికారులతో సంప్రతించి రేటును నిర్ణయించాలని ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియలో రైతులకు ఉన్న పంటలకు న్యాయమైన పరిహారం అందించే దిశగా అధికార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జీవో ప్రకారం వివిధ పంటలకు అమలులో ఉన్న రేట్లను అనుసరించాలని, లేని పంటలకు జిల్లా స్థాయి సంఘంచే రైతులకు సంతృప్తి చెందేలా రేట్లను నిర్ధారించి నష్టపరిహారాన్ని అందించాలని అన్నారు. జిల్లా స్థాయి సంఘం సమావేశమై సంబంధిత పంటలు సాగు వ్యయం, దిగుబడి, మార్కెట్ ధరలు మరియు రైతులకు కలిగే నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన రేట్లు నిర్ణయించాలని ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియ పారదర్శకంగా, రైతులకు అనుకూలంగా నిర్వహించబడాలని అధికారులకు సూచించారు. రైతులు అభ్యంతరాలు, సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బుట్టాయిగూడెం మండలం బుట్టాయిగూడెం భూ సేకరణలో ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేసి బుట్టాయిగూడెం మండలం కుడలిపాడు, కూనవరం గ్రామ ప్రజలకు గృహాలను అప్పుజెప్పాలని అన్నారు.ఈ సమావేశంలో భూసేకరణల స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.షాజానాయక్, జిల్లా పట్టు పరిశ్రమలు శాఖ అధికారి ఐ.శ్రీనివాసు,వెంకటరామన్నగూడెం శాస్త్రవేత్త డా.సుశీల, బుట్టాయి గూడెం మండలం ఉద్యానవన శాఖ అధికారి యన్.ప్రసన్నలక్ష్మి, సంబంధిత శాఖలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ ద్వారా బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి





## ఏలూరులోని వెంకట్రావుపేట నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో మెగా ఎన్రోల్మెంట్ లో విద్యార్థుల ప్రవేశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు,బ్యూరో చీఫ్ మే, 13 నంది పత్రిక** అంగన్వాడీలలో ప్రీ స్కూల్ పూర్తి చేసుకున్న పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏలూరులోని వెంకట్రావుపేట నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో మెగా ఎన్రోల్మెంట్ లో విద్యార్థుల ప్రవేశాలను బుధవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలు, వారి తల్లితండ్రులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులు అయిన ఉపాధ్యాయులు , ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటు పుస్తకాలు, ఉచిత యూనిఫారాలు, డిజిటల్ క్లాసు రూమ్లు, నాణ్యమైన బోధన మరియు ఇంగ్లీష్ మీడియం, మధ్యాహ్న భోజనపథకం, క్రీడా స్థలాలు, క్రీడా పరికరాలు, వంటి ఎన్నో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీ స్కూల్ నుండి 5 సంవత్సరాల వయస్సు దాటిన 7600 మంది చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యలో మానివేసిన విద్యార్థులను గుర్తించి, వారి తల్లితండ్రులతో మాట్లాడి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల వయస్సు నిండి అంగన్వాడీ ప్రీ స్కూల్ నుండి తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో మెగా డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు తెలియజేసి బడి బయట పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సదుపాయాలపై విద్యా శాఖ ముద్రించిన కరపత్రాలను పిల్లల తల్లితండ్రులకు కలెక్టర్ పంపిణీ చేశారు. డిఈఓ వెంకటలక్ష్మమ్మ, సమగ్ర శిక్ష ఏపిడి డా. పంకజ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ శారద, సమగ్ర శిక్ష అధికారులు ఎస్. నాగేశ్వరరావు, బి. భాస్కర రాజు, తహసీల్దార్ గాయత్రి, ఎంఈఓ లు వి. శ్రీనివాసరావు, అరుణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. రాజేశ్వరి, ప్రభృతులు పాల్గొన్నారు.

# జిల్లాలో గృహ గణన కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి .



**భీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి బుధవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల వారీగా గృహ గణన నమోదు ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జాతీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న గృహ గణనను ఎన్యూమరేటర్లు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు గృహ గణన నమోదు కేవలం 40 శాతం మాత్రమే పూర్తయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఎన్యూమరేటర్ ప్రతిరోజూ కనీసం 40 నుండి 50 గృహాల గణన పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా తొలిసారిగా జనగణన కార్యక్రమాన్ని డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నందున, చార్జ్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు గృహ గణన తొలి దశ నమోదుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయి కంట్రోల్ రూమ్ల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న గృహ గణన నమోదును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతిరోజు లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు మరియు డివిజన్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు సాధిస్తున్న ప్రగతిని రోజువారీగా సమీక్షించాలని తెలిపారు. లక్ష్యాలకు వెనుకబడిన సిబ్బంది కారణాలను గుర్తించి, తగిన మార్గదర్శకత్వం అందించి ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# గూడ్స్ వాహనాలలో ప్రయాణికులను ఎక్కించరాదు

## మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు

**మంత్రాలయం , మే 13, నంది న్యూస్ :-** గూడ్స్ వాహనాలలో ప్రయాణికులను ఎక్కించరాదని మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో జిల్లా ఉన్నతాధికారుల మేరకు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తో కలిసి మాధవరం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని ,అలా చేస్తే చట్ట ప్రకారం జైలు శిక్ష మరియు జరిమానా విధించడం జరుగుతుందని వాహనదారులకు హెచ్చరించారు. గూడ్స్ వాహానాలలో పలకలు అమర్చి వాటిపై ప్రయాణికులను రవాణా చేస్తే వాహనాలు సీజ్ ,యంవీ యాక్ట్ మేరకు జరిమానాలు విదించబడుతాయన్నారు.



# కోవెలకుంట్ల రైల్వే స్టేషన్ సమస్యల పై ఎంపీ కి ప్రజాసంఘాల వినతి



**బనగానపల్లె మే 13 నందిపత్రిక** కోవెలకుంట్ల రైల్వే స్టేషన్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోవెలకుంట్ల కు చెందిన ప్రజా సంఘాలు నంద్యాల ఎం.పి డాక్టర్ బైరెడ్డి శబరికి సమస్యలనువివరించారు కోవెలకుంట్ల ప్రజా సంఘాల నాయకులు మంగళవారం డాక్టర్ బైరెడ్డి శబరి ని నంద్యాల రైల్వే స్టేషన్ లో కలిసి సమస్యలను వివరించారు. కోవెలకుంట్ల పట్టణ రైల్వే స్టేషన్ నందు తాత్కాలిక నిలుపుదల ప్రతిపాదనతో నడుస్తున్నటువంటి గుంటూరు తిరుపతి గుంటూరు 17261/62 రైలుకు శాశ్వతమైనటువంటి స్టాపింగ్ చేయాలని అలానే ఇప్పటివరకు నడపబడుతున్నటువంటి ధర్మవరం మచిలీపట్నం ధర్మవరం రైలును బెంగళూరు వరకు పొడిగించేల చర్యలు తీసుకోవాలని వీటితోపాటుగా క కోవెలకుంట్ల రైల్వే స్టేషన్ లో ఉన్నటువంటి ప్రధాన సమస్యలు అయినటువంటి మరుగుదొడ్లు,రక్షిత తాగునీరు,వీధి దీపాలు,ప్రధాన రహదారి వెడల్పు తో పాటుగా ప్రస్తుతం వాడబడుతున్నటువంటి ప్లాట్ఫారం లను రైలు పొడవుకు అనుగుణంగా విస్తరించవలసిన ఆవశ్యకతను వివరించడం జరిగింది అలానే గతంలో కడప వరకు నడపబడుతున్నటువంటి తిరుమల ఎక్స్ప్రెస్ ను నంద్యాల వరకు పొడిగించవలసిందిగా రైల్వే ఉన్నతాధికారులను కోరగా కోవెలకుంట్ల ప్రజా సంఘ ఐక్యవేదిక యొక్క విన్నపాన్ని స్వీకరించి ఆ యొక్క రైలును నంద్యాల గుండా విశాఖపట్నం నడిపేందుకు సిద్ధపడిన రైల్వే అధికారులు తదుపరి జరిగిన పరిణామాల ద్వారా విశాఖపట్నం కొత్త రైల్వే జోన్ గా ప్రకటించడం మరియు ఆంధ్ర రాష్ట్రంలోని చివరి ప్రాంతమైనటువంటి గుంతకల్లు రైల్వే డివిజన్లు కలుపుటకు అనువుగా ఉంటుందని ఆలోచించి ఈ రైలును కడప నుండి గుంటకల్ వరకు పొడిగించడం జరిగింది. కోవెలకుంట్ల రైల్వే స్టేషన్ ప్రధాన రహదారి మరియు వీధి దీపాల గురించి బందెల ఓబులేసు , రైల్వే స్టేషన్ క్రింది నుండి మూడవ అంతస్తు అయిన ప్లాట్ఫారం చేరుటకులిఫ్ట్ సిస్టం ఏర్పాటు చేయవలసిందిగా కరీం భాష (రాష్ట్ర పౌర హక్కుల సంఘం) కోరగా ప్రస్తుతం నడపబడుతున్నటువంటి నంద్యాల రేణిగుంట్ల నంద్యాల డెమో రైలు అరకోణం లేదా చెన్నై వరకు పొడిగిస్తూ ఆ యొక్క రైలు సర్వీస్ నందు ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేయవలసిందిగా. గుర్రప్ప (బెస్త సంఘం) మరియు సుబ్బారెడ్డి (కోవెలకుంట్ల యువ సమాఖ్య)విన్నవించుకున్నారు, రైల్వే స్టేషన్లో ఉన్నటువంటి ప్రస్తుత ప్లాట్ఫారం లా పొడవు విస్తరణ మరియు రెండవ ప్లాట్ఫారం పునరుద్ధరణ ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమం లో సుధాకర్ సిపిఎం సుబ్బరాయుడు బీసి -ఐక్యవేదిక సుబ్బయ్య (రాయలసీమ కళావేదిక), వెంకటేశం , కాసిం (అడ్వకేట్), ఉదయ్(అడ్వకేట్) కోవెలకుంట్ల పాల్గొన్నారు.

# 15 నుండి ఎల్ఆర్‌యస్ మేళా

## రెండు రోజుల పాటు ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు పరిష్కారం

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** నగర పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్‌యస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు తమ పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు ఈ నెల 15, 16 తేదీలలో ప్రత్యేకంగా ఎల్ఆర్‌యస్ మేళా నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రెండు రోజుల పాటు ఈ మేళా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు సంబంధించిన షార్ట్‌ఫాల్ పత్రాలు, ఫీ ఇంటిమేషన్, చెల్లింపులు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ వంటి అంశాలను ఒకేచోట పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఆర్‌యస్ ద్వారా ప్లాట్లకు పూర్తి చట్టబద్ధత లభిస్తుందని, భవిష్యత్తులో రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు పొందడం, ఆస్తి బదలాయింపు వంటి ప్రక్రియలు సులభమవుతాయన్నారు. క్రమబద్ధీకరణ చేయించుకోని ప్లాట్లపై భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఎల్ఆర్‌యస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లింపులు లేదా అవసరమైన పత్రాల సమర్పణలో పెండింగ్‌లో ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు అందుబాటులో ఉండటంతో దరఖాస్తుదారులు అక్కడికక్కడే తమ సమస్యలను పరిష్కరించుకుని అప్రూవల్ ప్రొసీడింగ్స్ పొందవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులకు పూర్తి చట్టబద్ధత కల్పించుకోవాలని కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు.

# ఎరువుల దుకాణాలు తనిఖీ



**మంత్రాలయం , మే 13,నందీ న్యూస్ :-** మంత్రాలయం మండల పరిధిలోని కాచాపురం , మాధవరం గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి జీరాగణేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మకాలు చేసిన ఎరువుల యొక్క రైతులు వివరాలు తమ సమర్పించాలని దుకాణదారులు సూచించారు. రైతులు వారి భూమి సాగు వివరాలు నమోదు చేసుకుని రైతులు యొక్క అవసరం మేరకు వారి కోరిన ఎరువుల డిబిటి పద్దతి ద్వారా నమోదు చేసుకుని అమ్మకాలు జరపాలన్నారు. మండలంలో 270మీ మేర యూరియా నిల్వలు కలవు అన్నారు. రైతులు పంటలకు అవసరం మేరకే వాడాలని సూచించారు. ఎరువుల గురించి చిందిచాల్సిన అవసరం లేదన్నారు.



# శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్ధానంకు చందా

నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆలయ అభివృద్ధి కి అనంతపురం వాస్తవ్యులు మద్వరాజు శేషగిరి రావు వారి కుమార్తె మద్వరాజు పద్మశ్రీ ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ చందాను బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేద పండితులకు అందచేశారు.



# 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## రెమిడియల్ క్లాసులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, మే 13(నంది పత్రిక):-** పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని గుర్నాలపేటలో ఉన్న కే.ఎన్.ఎం. మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఇూజ రెమిడియల్ క్లాసులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, బోధన పద్ధతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుల పురోగతి, సబ్జెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా తెలుగు మరియు సైన్స్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. అయితే 3,375 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని తెలిపారు. వీరిలో కొంతమంది అన్ని సబ్జెక్టుల్లోనూ ఫెయిల్ కావడం ఆందోళనకరమన్నారు. అలాంటి విద్యార్థులు కూడా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి, వారికి అవసరమైన విధంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులను సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచి, ఇంటి పనులు చెప్పకుండా చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన మలుపు అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.



# ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

## రాష్ట్ర స్థాయి బండలాగుడి పోటీలను ప్రారంభించిన.. ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**జూపాడుబంగ్లా: మే: 13: (నంది పత్రిక)** మండల పరిధిలోని కనకయ్య కొట్టాల గ్రామంలో హనుమాన్ జయంతి మహోత్సవములు సందర్భంగా బుధవారం ఆరు పంట వృషభ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయ సూర్య హాజరై బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వ్యవసాయం అంటే గుర్తుకు వచ్చేది ఎడ్ల అని ఇప్పుడు ఎడ్ల పెంపకం తగ్గిపోతున్న రోజుల్లో మరల వాటిని గుర్తు చేసేలా ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించడం రైతులకు గుర్తు చేసేలా ఉందన్నారు. మల్లారెడ్డి రామాపురం గ్రామం గద్వాల ఎడ్లజత 488.10 మీటర్ల దూరాన్ని లాగే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఎడ్ల జత 3800 దూరాన్ని లాగే ద్వితీయ స్థానంలో నిలిచింది. చేసుకుంది. ఎడ్లజత 3500 దూరాన్ని లాగి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. ఎన్.రమణారెడ్డి వేంపెంటగ్రామం నంద్యాల జిల్లా ఎడ్ల జత 3200 మీటర్ల దూరాన్ని లాగే నాలుగు స్థానం, ఎం సత్తార్ కోటకుందుకూర్ నంద్యాల జిల్లా ఎడ్లజత2898.4 మీటర్లు లాగే 5 స్థానంలో నిలిచాయి. పెద్ద వెంకటేశ్వర్లు ఎడ్ల జత 2609.68 మీటర్లు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. ఎస్ బాబు శివపురం ఎడ్లజత2603.4 మీటర్లు లాగే ఏడో స్థానంలో నిలిచాయి. తుమ్మలూరు గ్రామానికి చెందిన ఎడ్ల జత2419.7 మీటర్ల లాగి 8వ స్థానంలో నిలిచాయి. ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో పండగ వాతావరణం నెలకొంది. మొదటి బహుమతి 40000 వేలు బళ్లారి వెంకట్రాముడు, బొమ్మనేని నడిపి సుబ్బారావు బొమ్మనేని చిన్న సుబ్బారావు, సింగల్ విండో సొసైటీ చైర్మన్ రెండవ30,000 వేలు బహుమతి కంచర్ల హజరత్తయ్య మాజీ వైస్ సర్పంచ్ మూడో బహుమతి 20,000 వేలు శావ వెంకటయ్య, శావ సుబ్బారావు వార్డు నెంబర్లు నాలుగో బహుమతి12000 వేలు గుండు శివకృష్ణ ఐదవ బహుమతి 10,000 వేలు బళ్లారి వెంకటేశ్వర్లు శ్రీనివాసులు, బి వి ఆర్ బ్రదర్స్, ఆరో బహుమతి 8000 వేలు నెలకుర్తి మల్యాద్రి ఏడవ బహుమతి 6000 వేలు హర్షిత 8వ బహుమతి 4000 వేలు మేకల శివ లింగేశ్వరుడు, మేకల శివప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డి సుధాకర్, టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# తలసేమియా బాధిత చిన్నారుల వైద్య సహాయార్థం పశ్చిమగోదావరి జిల్లా ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ఉదారత.



**బీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.1 లక్షల చెక్కును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి బ్రాంచ్ కు అందజేయగా, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తలసేమియా బాధిత పిల్లల వైద్య సేవల కోసం ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. ప్రస్తుత 2026 సంవత్సరంలో ఇప్పటికే ఈ అసోసియేషన్ ఒక లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించిందని గుర్తు చేశారు. తాజాగా మరో లక్ష రూపాయలు విరాళంగా అందించడం ద్వారా ఈ ఏడాది మొత్తం రూ.2 లక్షల సహాయాన్ని తలసేమియా బాధిత చిన్నారుల చికిత్స కోసం కేటాయించడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలో సేవాభావంతో ముందుకు వచ్చి అవసరమైన వారికి చేయూతనందించడం గొప్ప విషయం అని పేర్కొంటూ, వ్యాధిగ్రస్త చిన్నారులకు అండగా నిలిచేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, అసోసియేషన్లు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, తలసేమియా బాధిత చిన్నారుల చికిత్సకు తమ వంతు సహకారం అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఎన్.సరోజ, ఎల్పిజి డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# నిషేధిత భూముల జాబితా (22-ఏ) కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి రికార్డులు, అవసరమైన ఆధార పత్రాలతో విచారణలకు హాజరుకావాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**బీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) మరియు రెవెన్యూ క్లినిక్స్ పరిధిలో భూ వివాదాల పరిష్కార కార్యక్రమంలో భాగంగా నిషేధిత భూముల జాబితా 22-ఏ కు సంబంధించిన దరఖాస్తులపై విచారణ నిర్వహించారు. ఈ విచారణలో సంబంధిత మండల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నేడు నిర్వహించిన విచారణలో మొత్తం 11 కేసులను పరిశీలించినట్లు తెలిపారు. వాటిలో 4 కేసులను పరిష్కరించగా, 2 కేసులను నిరాకరించినట్లు పేర్కొన్నారు. మరో 5 కేసులు అవసరమైన పత్రాలు సమర్పించని కారణంగా వచ్చే వారానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదార్ పాస్‌బుక్స్, పన్ను రసీదులు తదితర పూర్తి ఆధారాలతో విచారణకు హాజరవుతే కేసుల పరిష్కారం మరింత త్వరితగతిన పూర్తవుతుందని సూచించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేసి అర్జీదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 వ తేదీన పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహణ

## కల్లూరు ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజల నుండి వినతుల స్వీకరణ

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ఈ నెల 15 వ తేదీన పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహణ లో భాగంగా కల్లూరు ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఒక ప్రకటన లో తెలిపారు.కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా వచ్చే శుక్రవారం 15 వ తేదీన కల్లూరు ఎంపిడిఓ కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) ను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో 15 వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కల్లూరు, ఓర్వకల్లు మండలాలు, కర్నూలు నగర పరిధిలోని 16 వార్డ్ లలో ఉన్న ప్రజలు తమ సమస్యలను తెలుపుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# కలెక్టరేట్‌లో బ్యాంబూ సేల్ కౌంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

**నంద్యాల బ్యూరో, మే 13(నంది పత్రిక):-** స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తూ, స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృతమైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో వెదురు (బ్యాంబూ)తో నిర్మించనున్న వినూత్న సేల్ కౌంటర్‌కు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో ఈ సేల్ కౌంటర్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణహిత విధానంలో వెదురుతో నిర్మించనున్న ఈ కౌంటర్ ద్వారా స్థానికంగా తయారవుతున్న వివిధ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించనున్నారు. ఈ సేల్ కౌంటర్‌లో మెప్మా డీఆర్‌డీఏ సెర్ప్ అటవీ శాఖకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయనున్నారు. మహిళా సంఘాలు, గ్రామీణ కళాకారులు మరియు అటవీ ఆధారిత ఉత్పత్తుల తయారీదారులకు ఇది ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడంతో పాటు, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడం, పర్యావరణ అనుకూల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు.



# పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు






### జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతం చేయాలి
### స్కిల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి
### ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగాల లక్ష్యాన్ని 1500కు పెంచాలి
### పెండింగ్ పరిశ్రమల అనుమతులు త్వరితగతిన పూర్తి చేయాలి
### "ఒక జిల్లా - ఒక ఉత్పత్తి" కు ప్రత్యేక ప్రాధాన్యం
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, మే 13(నంది పత్రిక):-** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, వివిధ సర్వేల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో అందించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ఆధునిక అవసరాలకు అనుగుణంగా వివిధ రంగాలలో సంవత్సరం వారీగా నైపుణ్య శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రస్తుతం నిర్దేశించిన 900 ఉద్యోగాల లక్ష్యాన్ని 1500కు పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. "ఒక జిల్లా – ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద బేతంచర్ల నాపరాయి సిమెంట్ మరియు పోర్ట్‌ల్యాండ్ సిమెంట్ ఉత్పత్తులను ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 14 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా ఇప్పటికే 3 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన 11 దరఖాస్తులను సంబంధిత శాఖలు గడువులోపు పరిశీలించి అనుమతి ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా పెట్టుబడి రాయితీలు, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీల సబ్సిడీలు, పన్ను రాయితీలు వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాల కింద జిల్లాలోని 10 పరిశ్రమల యూనిట్లకు రూ.81.62 లక్షల విలువైన రాయితీలను కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ వెల్లడించారు. పీఎం–సేతు పథకం కింద నంద్యాల ఐటీఐ కళాశాల అభివృద్ధికి రూ.240 కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.79 కోట్లు భరించగా, మిగిలిన రూ.41 కోట్లు స్థానిక వనరుల ద్వారా సమీకరించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో డ్రాపౌట్ అయిన విద్యార్థులను గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయికి పంపే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని తుది రూపు ఇవ్వాలని సూచించారు. కౌశలం మరియు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేల్లో తక్కువ హాజరు నమోదవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 76 వేల మంది నమోదు చేసుకున్నప్పటికీ కేవలం 29 శాతం మాత్రమే హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు.

# షాక్ సర్క్యూట్ తో కూలీల షెడ్లలో అగ్ని ప్రమాదం

### పేలిన మూడు డొమెస్టిక్ సిలిండర్లు
### మరో సిలిండర్ పేలకుండా తీసేసిన గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది
### కూలీలు పనికి వెళ్లిన నేపథ్యంలో తప్పిన ప్రమాదం
### ఫైర్ ఇంజన్ వచ్చే లోపు మంటలను అదుపులోకి తెచ్చిన పోలీసులు
### స్థానికంగా ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అవస్థలు
### కూలీలను ఆదుకుంటామన్న పీఠాధిపతులు



**మంత్రాలయం , మే 13,నంది న్యూస్ ;-** ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ నరహరి తీర్థ అథిది గృహం పక్కన ఉన్న కూలీల షెడ్లలో విద్యుత్ షాక్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించింది. శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ రాష్ట్రం నుండి కార్మికులను రప్పించి కాపురాలు చేసేందుకు షెడ్లను ఏర్పాటు చేశారు. బుధవారం కూలీలు తమ పనులకు వెళ్లిన తర్వాత జరిగిన ఘటనలో 3 డొమెస్టిక్ సిలిండర్లు పేలి మంటలు చలరేగాయి. విషయం తెలుసుకున్న సిఐ దస్తగిరి బాబు ఎస్సై మల్లికార్జున సిబ్బందితో ఎస్ ఆర్ ఎస్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సలీం, సిబ్బందితో రాగా విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. మరో పెద్ద సిలిండర్ ను గమనించిన గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సోమేశ్వర్ ధైర్యంగా సిలిండర్ బయటకు తెచ్చి ప్రమాదాన్ని నివారించారు. ఫైర్ ఇంజన్ కోసం ఎదురు చూడకుండా పోలీసు అధికారులు మంటలను అదుపులోకి తీసుకొచ్చిన అనంతరం ఫైర్ ఇంజన్ వచ్చి షెడ్లలో ఉన్న మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

## బాధిత కార్మికులను ఆదుకుంటాం



**మంత్రాలయం , మే 13,మనం న్యూస్ :-** అగ్ని బాధిత కుటుంబాలను ఆదుకుంటామని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా ఆరు షెడ్లలో మంటలు చెలరేగి బూడిద అయిన ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి దయ వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని పేర్కొన్నారు. మంటలను అదుపు చేయడంలో పోలీసు, విద్యుత్, ఫైర్, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది చేసిన కృషి ప్రశంసించారు. ఈ సందర్భంగా సిఐ దస్తగిరి బాబు ఎస్సై మల్లికార్జున ట్రాన్స్ కో ఏఈ గోవిందు లైన్ మెన్ రంగస్వామి, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సలీం ఇతర సిబ్బందిని అభినందించారు. నష్టం జరిగిన బాధితులకు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# పూడికతీతతో పునర్జన్మ పొందిన నొస్సం పెద్ద చెరువు





### "జలదార - జలహారతి"తో రైతుల్లో కొత్త ఆశలు
### 500 ఎకరాల నుంచి 600 ఎకరాల సాగుకు నీటి భరోసా
### చెరువు మట్టితో సారవంతమవుతున్న రైతు పొలాలు
### "జలదార - జలహారతి"తో నొస్సం పెద్ద చెరువు రైతు భవిష్యత్తుకు కొత్త వెలుగు

**నంద్యాల బ్యూరో, మే13(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా సంజామల మండలంలోని నొస్సం గ్రామానికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువు ఇప్పుడు గ్రామ ప్రజల ఆశలకు ప్రతీకగా నిలుస్తోంది. ఒకప్పుడు పూడికతో నిండిపోయి తన అసలు సామర్థ్యాన్ని కోల్పోయిన ఈ చెరువు, ఇప్పుడు "జలదార – జలహారతి" కార్యక్రమంతో కొత్త జీవం పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పూడికతీత పనులు గ్రామ రైతాంగంలో కొత్త ఆశలు నింపుతున్నాయి. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పెద్ద చెరువుకు చుట్టుపక్కల నాలుగు వేల ఎకరాల కొండ ప్రాంతం నుంచి వర్షపు నీరు చేరుతుంది. ప్రతి వర్షాకాలంలో కొండల నుంచి ఉరకలెత్తే నీరు ఈ చెరువులోకి చేరి నిండుగా నిల్వ అవుతుంది. చెరువుకు ఉన్న రెండు తూముల కింద దాదాపు 500 ఎకరాల సాగుభూమి ఉంది. ఈ భూముల్లో ప్రధానంగా వరి పంట సాగు చేస్తుంటారు. అయితే సంవత్సరాలుగా పేరుకుపోయిన పూడిక కారణంగా చెరువు లోతు తగ్గిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. రైతులకు అవసరమైనంత కాలం సాగునీరు అందక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను గుర్తించిన జిల్లా యంత్రాంగం "జలదార – జలహారతి" కార్యక్రమంలో భాగంగా చెరువు పూడికతీత పనులను ప్రాధాన్యంగా చేపట్టింది. ఈ పనుల కోసం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా గారి ప్రత్యేక చొరవతో రూ.9.51 లక్షలు వెచ్చించి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నారు. ఉపాధి హామీ శ్రామికులు, రైతులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు సమన్వయంతో పనిచేస్తూ చెరువుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తున్నారు. పూడికతీత పనుల వల్ల చెరువు లోతు గణనీయంగా పెరిగింది. దీంతో ఈ ఏడాది వర్షాకాలంలో మరింత ఎక్కువ నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 500 ఎకరాలకు పరిమితమైన సాగు విస్తీర్ణం, ఇకపై 600 ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నుంచి తీస్తున్న సారవంతమైన మట్టిని రైతులు తమ సొంత ఖర్చులతో పొలాలకు తరలించుకుంటున్నారు. ఈ మట్టితో పొలాల్లో ఉన్న గుంతలను పూడ్చడం, తెగిపోయిన గట్లను బలపరచడం, భూమి సారాన్ని పెంచడం జరుగుతోంది. దీంతో భూముల ఉత్పాదకత పెరిగి మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "చెరువులు గ్రామీణ వ్యవసాయానికి జీవనాడి వంటివి. పూడికతీత పనులు కేవలం నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడమే కాదు, రైతుల ఆదాయాన్ని పెంచే శాశ్వత పరిష్కారంగా నిలుస్తాయి. 'జలదార – జలహారతి' కార్యక్రమం ద్వారా ప్రతి నీటి వనరును పునరుద్ధరించి గ్రామాలను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ శ్రామికులకు ఉపాధి లభిస్తుండగా, రైతులకు సాగునీటి భరోసా కలుగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. నొస్సం పెద్ద చెరువు పూడికతీత పనులు ఇప్పుడు ఒక సాధారణ అభివృద్ధి కార్యక్రమంగా కాకుండాఁ "నీటిని నిల్వ చేస్తేనే గ్రామ భవిష్యత్తు నిలుస్తుంది" అనే సందేశాన్ని ఇస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు.



## టౌన్ కాట్ సూపర్ మార్కెట్ ప్రారంభం



**వెలుగోడు, మే 13 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన "టౌన్ కాట్ సూపర్ మార్కెట్" ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి మైనారిటీ నాయకులు డాక్టర్ జాకీర్ హుస్సేన్ రిబ్బన్ కత్తిరించి మార్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెలుగోడు మండల ప్రజలకు అవసరమైన గృహోపకరణాలు, కిరాణా సరుకులు మరియు నిత్యావసర వస్తువులు అతి తక్కువ ధరలకు ఒకేచోట అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెలుగోడు మండల ప్రజలు ఈ సూపర్ మార్కెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెహబూబ్ ఖాన్, నూరుల్లా, స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, గ్రామస్తులు మరియు యువకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి..
## సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ

### వేసవి అలవెన్స్, పనిముట్లు, కనీస వసతులు కల్పించాలి

**జూపాడుబంగ్లా :మే: 13: (నంది పత్రిక )** మండల పరిధిలోని తర్తూరు గ్రామ సమీపంలోని వీపనగండ్ల రస్తా వాగులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల సమస్యలను సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నాయకులు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు గ్రామ శాఖ కార్యదర్శి నవ్వసానితో కలిసి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని తీవ్రంగా ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు, కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు రోజుకు కనీసం రూ.600/– కూలీ చెల్లించాలని వేసవి కాలంలో తీవ్ర ఎండల మధ్య పనిచేస్తున్న కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సమ్మర్ అలవెన్స్ ప్రకటించాలని కోరారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు, మెడికల్ కిట్లు వంటి కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.వేసవి తీవ్రత కారణంగా ఉపాధి కూలీలు వడదెబ్బలకు గురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నాయకురాలు ఎస్. నవ్వసాని, శ్రీరాములు, ఉపాధి కూలీలు శ్రీకాంత్, నారాయణ గౌడ్, షరీఫ్, నన్నే హుస్సేన్, మహేంద్ర, మద్దిలేటి, కర్ణమ్మ, లక్ష్మీదేవి, వరలక్ష్మి, కృష్ణవేణమ్మ, కళావతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఆలయప్రతిష్టకు మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి



**బనగానపల్లె మే 13నందిపత్రిక** కోవెలకుంట్ల మండల పరిధిలోని లింగాల గ్రామంలో గురువారం జరగనున్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం లో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసి జనార్దన్ రెడ్డి పాల్గొననున్నారని మంత్రి కార్యాలయం బుధవారం తెలిపారు. ప్రతిష్ట కార్యక్రమం అనంతరం 10:00 గంటలకు కోయిలకుంట్ల పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నందు కోయిలకుంట్ల మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో మాట్లాడతారని తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయాలపై ఏసిబి కన్ను..!

### ఆయా కార్యాలయాల ఆవరణంలో తిష్ట వేసి కొంత సమాచారం సేకరణ...!

**నంద్యాల బ్యూరో మే 13 నంది పత్రిక;-** నంద్యాల జిల్లా పరిధిలోని రెవెన్యూ విభాగంలో ఉన్న ముగ్గురు అవినీతి అధికారులపై " లిరెవెన్యూలో కలెక్షన్ రాజాలు" అనే శీర్షికతో నంది దినపత్రికలో ఈనెల 8వ తేదీన వచ్చిన కథనం పాఠకులకు తెలిసిందే. అదేవిధంగా నిన్న బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలోని కొందరి అవినీతి అధికారులపై ఇదే నందిపత్రికలో మున్సిపల్ శాఖలో ముదుర్లు అనే శీర్షికతో వార్త ప్రచురించబడింది కూడా పాఠకులకు విధితమే. అయితే ఈ నందిపత్రికలో వచ్చిన రెండు కథనాలపై ఏసీబీ అధికారులు స్పందించి బుధవారం కొన్ని వివరాలు కూడా సేకరించి, ఆయ కార్యాలయాల పరిసరాలలో బుధవారం ఉదయం, సాయంత్రం వేళలో ఆయా అధికారులపై నిఘా ఉంచి, ఆయా కార్యాలయాలకు సంబంధించిన కొందరు సిబ్బంది ద్వారా వివరాలు సేకరించినట్లు సమాచారం.

# రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో వెన్నం శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర.





## మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రశంసలు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం.

## మానుకోటలో నయాజోష్...

**మహబూబాబాద్, మే 13(నంది పత్రిక):** జిల్లాలో అభివృద్ధి పనుల బలోపేతానికి, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు కావడంలో వెన్నం శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. వెన్నం శ్రీకాంత్ రెడ్డి పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి నుంచి పనిచేస్తూ కార్యకర్తలను సమన్వయం చేశారని, ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజలకు విద్యా, విజ్ఞాన సేవలు అందించే గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి కృషి చేస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి, యువతలో పఠనాసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ వెన్నం శ్రీకాంత్ రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, డిసిసి అధ్యక్షులు ఉమా మురళీ నాయక్, రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి ఝాన్సీ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షుడు భరత్ బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారధి, అజయ్ సారధి, సిపిఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యులు రాధ, మున్సిపల్ చైర్మన్ జ్యోతి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ లోయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీలత, యూత్ అధ్యక్షుడు సురేష్, బాలు చౌహన్, వార్డు కౌన్సిలర్ అరుణ, వివిధ వార్డు కౌన్సిలర్ లు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా యువత స్వయం సహాయక సంఘాలు ముందుకు రావాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరంబ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా యువత మరియు స్వయం సహాయక సంఘాలు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని, కొత్త ఉత్పత్తులను నాణ్యత ప్రమాణాలతో తయారుచేసి ఆకర్షణీయమైన ప్యాకింగ్ ద్వారా మార్కెటింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీపీఎంలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పథకాల అమలు, లక్ష్యాల సాధన, ఫీల్డ్ స్థాయి సమస్యలు, పరిష్కార చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించి పలు సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాల బలోపేతం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధి కార్యక్రమాల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. డీపీఎంలు తమ పరిధిలో కొనసాగుతున్న పనుల వివరాలను సమావేశంలో వివరించగా, పనుల నాణ్యతపై రాజీ పడకుండా పర్యవేక్షణ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు జిల్లాలో మంచి అవకాశాలు ఉన్నాయని, కొబ్బరి పీచుతో పరుపులు, కొబ్బరి టెంకాయలతో బొగ్గు, కొబ్బరి చిప్పల ద్వారా నూనె వంటి ఉత్పత్తులను తయారుచేసి మార్కెటింగ్ చేస్తే ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం పుట్టగొడుగుల పెంపకం మరియు ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ఈ తరహా యూనిట్లను స్థాపిస్తే ఉపాధితో పాటు మంచి ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు. చాక్లెట్ తయారీ యూనిట్ల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేస్తే మంచి లాభాలు సాధించవచ్చని సూచించారు. బయటి ప్రాంతాల పరిశ్రమలపై ఆధారపడకుండా స్థానిక యువత స్వయంగా పరిశ్రమలను స్థాపిస్తే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని కొత్త ఫుడ్ ప్రొడక్ట్స్ తయారుచేసి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్లో విక్రయాలకు ఉంచితే మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వీరవాసరం మండలంలో స్త్రీనిధి రికవరీ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు వాటర్ హైసింత్ కంపోస్ట్ తయారుచేసి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. సామాజిక పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన నిధులను ప్రతి నెల ఐదో తేదీ లోపు ప్రభుత్వ ఖజానాకు తిరిగి జమ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఏ పిడి ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, ఏపీఎం లు కె.శ్రీనివాసరావు, ఎస్.కుసుమ కుమారి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల్లో భాగంగా సర్పంచ్, కౌన్సిలర్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహణ



**కేసముద్రం, మే 13(నంది పత్రిక):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే విద్యా వారోత్సవాలు మూడవ రోజు బుధవారం కేసముద్రం మండలంలోని సర్పంచులు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం విలేజ్ పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపు కోసం సర్పంచ్, మున్సిపల్ కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, విద్యార్థికి కిట్, బ్రేక్ ఫాస్ట్ మొదలగు సదుపాయాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్, తాళ్లపూసపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య, రిసోర్స్ పర్సన్లు గనె యాదగిరి, వట్నాల సత్యనారాయణ, ఎం.ఐ.ఎస్. కోఆర్డినేటర్ షేక్ ఖాదర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వెన్ను బిక్షపతి, సి.ఆర్.పి.లు నేరెళ్ల పద్మ, చీర మురళి, ఇస్సంపల్లి ఉదయ్, పులి సరిత, మెసెంజర్ బిక్షపతి పాల్గొన్నారు.

## కాశి, అయోధ్యలలో నృత్య ప్రదర్శన నిర్వహించిన హస్రిత





**కేసముద్రం నందిపత్రిక :** 9 ఏళ్ల చిరుప్రాయంలోనే నృత్య ప్రదర్శన నిర్వహించిన హస్రిత అందరి ప్రశంసలను, అభినందనలను అందుకుంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన నాంపల్లి వెంకన్న, చైతన్య దంపతుల ముద్దుల గారాల పట్టి అయిన హస్రిత మూడవ తరగతి చదువుతూ ఉంది. కూచిపూడి పై మక్కువ పెంచుకున్న హస్రిత ను తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సహించారు. హైదరాబాదులో ఉప్పల్ లోని శ్రీ సాయి చరణ్ కళాక్షేత్రం లో కూచిపూడి గురువు అయిన డాక్టర్ మధుమతి ఆధ్వర్యంలో హస్రిత ఈనెల 9న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాశీలోనూ, 11న అయోధ్యను కూచిపూడి నాట్య ప్రదర్శనను నిర్వహించింది. భారతీయ సాంప్రదాయ నృత్య కళ అయిన కూచిపూడిని నైపుణ్యంతో ప్రదర్శించిన హస్రిత ప్రతిభకు, నిర్వాహకులు కళాభిమానులు అబ్బుర పడిపోయారు. హస్రిత ను ప్రశంసలతో ముంచెత్తారు. గురువు డాక్టర్ మధుమతి శిక్షణలో విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయిలలో ప్రతిభ కనబరుస్తున్నారని పలువురు ప్రశంసించారు. హస్రిత సాధించిన విజయంపై తల్లిదండ్రులు ఆనందంలో మునిగి తేలుతున్నారు.

## కేసముద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ వేం నరేందర్ రెడ్డి



**కేసముద్రం, మే 13(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపాలిటీలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ముఖ్యమంత్రి సలహాదారుడు, రాజ్యసభ ఎంపీ నరేందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కేసముద్రం మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పాలిటెక్నిక్ కాలేజ్ భవనాన్ని, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని, రోడ్లు, డ్రైనేజీతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి తగు సూచనలు సలహాలు అందజేశారు. వేం నరేందర్ రెడ్డి తో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# గుర్తుతెలియని వ్యక్తులు కోళ్లను చంపేశారు



**వెలుగోడు, మే 13 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని కార్పెంటర్ ఆసిఫ్ భాష ఇంటిలో బుధవారం ఉదయం కోళ్లు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం రాత్రి యథావిధిగా కోళ్లను గంపల కింద మూసి పెట్టి తాము నిద్రపోయామని, బుధవారం తెల్లవారుజామున లేచి చూడగా కోళ్లు చనిపోయాయని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు కోళ్లను చంపివేసి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. ఇటీవల ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి వేళల్లో భద్రతా చర్యలు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఈనెల 15న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

**ఆళ్లగడ్డప్రతినిధి మే 13, నంది పత్రిక** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 15 శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ఆళ్లగడ్డ నియోజకవర్గం వేదిక అవుతుందని. అలాగే ఈ నాలుగు శుక్రవారాల పాటు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా స్వయంగా ఆళ్లగడ్డ పట్టణలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసినమీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే శుక్రవారం నుంచి వరుసగా నాలుగు వారాల పాటు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ భారీ గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల) కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ నందు ఉదయం నుండి సాయంత్రం వరకు కలెక్టర్ నియోజకవర్గంలోనే ఉండి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని అన్నారు. ప్రజలు తమ దీర్ఘకాలిక సమస్యలు, భూ సంబంధిత వివాదాలు, పింఛన్లు లేదా ఇతర పౌర సేవలకు సంబంధించిన సమస్యలపై నేరుగా జిల్లా అత్యున్నత అధికారికే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించామన్నారు. ఈ గ్రీవెన్స్ సమావేశంలో రెవెన్యూ అధికారులు,మున్సిపల్ కమిషనర్,మండల స్థాయి అధికారులతో పాటుఅన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. తద్వారా దరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ప్రజలు తమ సమస్యల కోసం జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా, పాలనను మీ ముంగిటకే తెస్తున్నా మన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.



## సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 13 నంది పత్రిక** విద్యార్థులవేసవి సెలవుల దృష్ట్యా సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పిల్లలు మొబైల్ ఫోన్స్ కు బానిసలైవారి జీవితాలను నాశనం చేసుకోకుండాపిల్లల భవిష్యత్తు కోసం 'భూమా శోభా నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బేసిక్ కంప్యూటర్ ట్రైనింగ్.స్పోకెన్ ఇంగ్లీష్, అబాకస్.క్రీడలు & రక్షణ: బాడ్మింటన్ మరియు తైక్వాండోలో నిపుణులచే శిక్షణ ఇప్పించనున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిబిరాల్లో చేర్పించి, వారిలోని ప్రతిభను వెలికితీయాలని ఆమె కోరారు.

## భూమికి దూరంగా వెళ్లిపోతున్న 'చందమామ'!

మనకు రాత్రిపూట వెన్నెల కురిపించే చందమామ భూమి నుంచి నెమ్మదిగా దూరంగా జరిగిపోతున్నాడా? దీనివల్ల భూమిపై రోజు నిడివి పెరుగుతోందా? అంటే అవుననే అంటున్నారు శాస్త్రవేత్తలు. చంద్రుడు ఏటా సుమారు 1.5 అంగుళాలు (3.8 సెం.మీ.) చొప్పున భూమికి దూరమవుతున్నాడని, ఈ ప్రక్రియనే 'లూనార్ రిసెషన్' అని పిలుస్తారు.

**ఇదంతా ఆటుపోట్ల వల్లే..**

ఈ ప్రక్రియ వెనుక ఉన్న ప్రధాన కారణం భూమి, చంద్రుడి మధ్య ఉండే గురుత్వాకర్షణ సంబంధం, దానివల్ల ఏర్పడే సముద్రపు ఆటుపోట్లే. లండన్‌కు చెందిన జియోఫిజిక్స్ ప్రొఫెసర్ డేవిడ్ వాల్థామ్ ప్రకారం, చంద్రుడి ఆకర్షణ శక్తి సముద్రాల్లో ఆటుపోట్లను సృష్టిస్తుంది. భూమి తన అక్షం మీద వేగంగా తిరగడం వల్ల, ఈ ఆటుపోట్ల ప్రభావం భూభ్రమణ వేగానికి ఒక బ్రేక్‌లా పనిచేసి, దాని వేగాన్ని స్వల్పంగా తగ్గిస్తుంది. ఈ క్రమంలో బదిలీ అయిన శక్తితో చంద్రుడు తన కక్ష్యలో కొంచెం పైకి నెట్టబడి, భూమి నుంచి మరింత దూరంగా వెళతాడు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య






## డీఈవో జనార్దన్ రెడ్డి తిమ్మాపురంలో విద్యా చైతన్య యాత్ర ..

**మహానంది మే 13 (నంది పత్రిక):-** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య కొనసాగుతోందని డీఈవో జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి,వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని డీఈవో జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం మహానంది మండలం అబ్బీపురం , పుట్టుపల్లి గ్రామాల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు మరియు పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ బడులలో లభిస్తున్న ఉన్నత ప్రమాణాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. తిమ్మాపురం పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని, ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు (నేటి ఉపాధ్యాయులు) తమ గ్రామ పాఠశాల అభివృద్ధిపై డీఈవో చూపిస్తున్న చొరవను అభినందించారు.జిల్లా విద్యా రంగాన్ని అగ్రపథాన నడిపిస్తున్న జనార్దన్ రెడ్డి గారిని వారు ఘనంగా సన్మానించి,

జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమం లో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డితో పాటు , ఉపాధ్యాయులు దేవనాల శ్రీనివాసులు,పిట్టల శ్రీనివాసులు,కల్లెమద్దిలేటి,గణి శ్రీనివాసులు,జనార్దన్. చక్రధర్, హుశ్శేన్ భాష మరియు, సీఆర్పి తిమ్మయ్య,గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు తిమ్మయ్య,కుంపటి రమణయ్య, బోయ భాస్కర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మరియు విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.అధికారులే నేరుగా గ్రామానికి వచ్చి విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# పది ఫలితాల్లో కేజీబీవీ కేక..





## పది ఫలితలలో జిల్లాలో ఉండే 12 కేజీబివి పాఠశాలలో అగ్రస్థానం లో మర్రిపాడు కేజీబివి...... ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు మర్రిపాడు కె... ప్రశంసించిన ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ):

**మర్రిపాడు మే 13నంది పత్రిక :** మర్రిపాడు కేజీబీవీ విద్యార్థునిల అద్భుత ప్రతిభతో ప్రభుత్వ విద్యారంగానికి, ముఖ్యంగా 2025-26 విద్యాసంవత్సరానికి బాలికా విద్యకు మంచి గుర్తింపు లభించింది కేజీబీవీల పనితీరు గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా మెరుగుపడి జిల్లాలో ఉండే 12 పాఠశాలలో మర్రిపాడు కేజీబివి విద్యార్థినిలు పదవ తరగతిలో -టి .మస్తానమ్మ 584/600, పి .మహిత 581/600, ఎం .మేరీ 579/600 అగ్రస్థానాల దిశగా దూసుకువెళ్లి జిల్లాలోనే ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలనుకైవసం చేసుకొని నెల్లూరు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం లో బుధవారం జరిగిన కార్యక్రమం లో . ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ )చేతులు మీదుగా ప్రశంస పత్రం, అవార్డు అందుకున్నారు ఈ కార్యక్రమంలో కేజీబివి పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి విద్యార్థులు పట్ల చూపిన ప్రత్యేక శ్రద్దను కొనియాడారు.

పదో తరగతి (రూజ) మరియు ఇంటర్మీడియట్ ఫలితాలలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (ఖ+దీఎ) అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలిచి జిల్లాల్లో మర్రిపాడు కేజీబీవీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలవడం పట్ల విద్యార్థినిల తల్లిదండ్రులు అనందం వ్యక్తం చేస్తున్నారు.కేజీబీవీ విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి డిస్ట్రిక్ట్ టాపర్లుగా నిలిచి ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ )చేతులు మీదుగా అవార్డులు పొందడంపై ప్రిన్సిపాల్ లక్ష్మి దేవి, పాఠశాల టీచర్లు సంతోషం వ్యక్తం చేశారు.

## ఈనెల 15న ఆచంట బాలం వారి పాలెం పి -ఫోర్ బిల్డింగ్ లో ప్రత్యేకప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరంబ్యూరో చీఫ్ : మే 13, నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ఒక నెలలో ఒక నియోజకవర్గం నాలుగు వారాలు పి జి ఆర్ ఎస్ కార్యక్రమాలను జిల్లాలో మొదటిసారిగా ఆచంట నియోజకవర్గంలోని ఆచంటలో మే 15 శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలియజేశారు.ఆచంట బాలం వారి పాలెం పి-ఫోర్ బిల్డింగ్ నందు ప్రత్యేక "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" ను ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార నివేదికలో ఆచంట, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. నియోజకవర్గం పరిధిలో నాలుగు విడతలుగా నిర్వహించు ప్రత్యేక గ్రీవెన్స్ లో నాలుగో విడత పిజిఆర్ఎస్ కార్యక్రమం నాటికి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాను ఫ్రీ గ్రీవెన్స్ గ్రామాలుగా రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ఆచంట నియోజకవర్గం ఇన్చార్జ్ అధికారి ఎంపీడీవోలు ఎమ్మార్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారుల కొరకు సెంటర్ లో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమ ఏర్పాట్లు అధికారులందరూ సమన్వయంతో పూర్తి చేయాలని, ఎక్కడ ఎటువంటి లో టుపాట్లుకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు..

## విష ఆహార ఘటనలో బాధితులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 13నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం ఎస్.కొండేపాడు గ్రామంలో ఈరోజు ఫుడ్ పాయిజనింగ్ గురైనట్లు అనుమానిస్తున్న ఘటన చోటుచేసుకుంది. గణపవరం మండల తహసీల్దార్ అందించిన వివరాల ప్రకారం, స్వర్ణ సచివాలయం ఎదురుగా ఉన్న గ్రామ చెరువు గట్టుపై నివసిస్తూ చెరువులకు కాపలా కాస్తున్న నాలుగు కుటుంబాలకు చెందిన 12 మంది సభ్యులు ఈరోజు ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఒక గ్రామస్థుడు ఇచ్చినట్లు చెప్పబడుతున్న మైదా పిండితో తయారుచేసిన బజ్జీలు తిన్నారు. తరువాత సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో వారిలో వాంతులు మరియు ఇతర అస్వస్థత లక్షణాలు కనిపించడంతో వెంటనే బాధితులను ఆసుపత్రులకు తరలించారు. బాధితులలో నలుగురిని తణుకు ఆసుపత్రికి, మిగిలిన ఎనిమిది మందిని భీమవరం ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనపై సంబంధిత వైద్య మరియు రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేయడంతో బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విష ఆహార బాధితులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్, ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు, ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ఉపసభాపతి మరియు శాసనసభ్యులు, జిల్లా ఎస్పీ ఆసుపత్రులను సందర్శించి బాధితులను పరామర్శించారు. వారికి అందిస్తున్న చికిత్స, వైద్య సౌకర్యాలపై వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. అలాగే గణపవరం తహసీల్దార్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, భీమవరం ఆర్డీవో ఇంపీరియల్ ఆసుపత్రి మరియు వర్మ ఆసుపత్రులను సందర్శించి బాధితుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం జరుగుచున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. తణుకు ఆసుపత్రిలో వారు కూడా భీమవరం ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించడం జరుగుతున్నదని 12 మందిలో పెద్దవాళ్లకి ఒక చిన్నారికి నలుగురికి సీరియస్ గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

..



## వైసీపీ నాయకుని కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ సుధీర్ దార.



**నందికొట్కూరు మే 13( నంది పత్రిక )** నందికొట్కూరు పట్టణము బైరెడ్డి నగర్ కు చెందిన వైసిపి నాయకులు జగన్ రఫీ భార్య అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డాక్టర్ సుధీర్ దార పట్టణ నాయకులతో కలిసి బుధవారం జగన్ రఫీ గృహమునకు చేరుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ రఫీ భార్య మృతి గల కారణాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహమ్మద్, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు మార్కెట్ రాజు, పట్టణ యూత్ అధ్యక్షులు లడ్డు, మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన వైఎస్ఆర్సిపి నాయకులు.



**బేతంచెర్ల మే 13 (నందిపత్రిక )** బేతంచెర్ల పట్టణంలోని దుర్గా పేట కాలనీకీ చెందిన కీ "శే " ఆర్టీసీ డ్రైవర్ గజ్జి మద్దయ్య & లింగమ్మ దంపతుల కుమారుడు జె.రమేష్ & మౌనికల వివాహం కాల్వబుగ్గ దేవస్థానం టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం జరిగినది. ఈ వివాహానికి బేతంచెర్ల మండల ప్రజా పయిషత్ అధ్య క్షులు బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్.చలం రెడ్డి, వైసిపిసీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్న ఎద్దులన్న, గజ్జి మద్దయ్య, అభిమన్యుడు తదితరులు పాల్గొన్నారు

## మాజీ సర్పంచ్ తమ్మునికి నివాళులర్పించిన వైసీపీ సీనియర్ నాయకుడు బాబు రెడ్డి.



**బేతంచెర్ల మే 13 (బేతంచెర్ల నందిపత్రిక ).** బేతంచెర్ల మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు తమ్ముడు బుక్కాపురం వెంకట రాముడు( 50) అనారోగ్యంతో కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి,వెంకటరాముడు మృతి పట్ల సంతాపం తెలిపారు. వారి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులు లర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో గొరుమానుకొండ మాజీ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ,వైసిపి నాయకులు సూర్య బల్లాని, బుగ్గానిపల్లె మధు కుమార్, రమణ, గురుమూర్తి, హరికృష్ణ, వెంకటరాముడు, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మద్దిలేటి స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు కార్యక్రమం. ఉప కమిషనర్ & శ్రీ మద్దులేటి స్వామి ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎమ్.రామాంజనేయులు.



**బేతంచెర్ల మే 14 (నందిపత్రిక )** బేతంచర్ల మండలము ఆర్ఎస్ రంగాపురం గ్రామ పోలి మేరలలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రం లక్షలాది భక్తుల ఆరాధ్య దైవము శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం నందు శ్రీ స్వామివారికి,అమ్మవార్లకి భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలు ఈ దినం అనగా గురువారం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఎం రామాంజనేయులు తెలిపారు.31-3-2026 నుండి13-5-2026 వరకు ఇవాల్టి వరకు 44 రోజుల హుండీని దేవాదాయ శాఖ తనిఖీ అధికారి మరియు ఆలయ ఉప కమిషనర్ ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం.రామాంజనేయులు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టనున్నారని ఆయన తెలియ జేశారు.



# మారిన రాజకీయం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ఇరవయ్యవ శతాబ్దం మొదటి ఐదు దశాబ్దాలు రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమాలు చరిత్రను చాలా మలుపులు తిప్పాయి. మన దేశం కూడా ఆ చరిత్రలో భాగమే. గత ఎనిమిది దశాబ్దాలుగా భారతదేశంలో రాజ్యాంగం ఆధారిత ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో వచ్చిన కొన్ని నవలల్లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అని భావోద్వేగంతో ఒక మధ్యతరగతి ఒక పేదవాడికి చెపితే, “అయితే ఏమవుతుంది?” అని అమాయకంగా అడగడం మనోహర్ మలగాంకర్ తన ‘బెండ్ ఇన్ గాంజెస్’ అనే నవలలో రాశాడు. మన ప్రాంతంలో చాలా చర్చకు వచ్చిన కన్యాశుల్కంలోని జట్కావాడు… “భారతదేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నది” అని గిరీశం అంటే “మన ఊరిలోని హెడ్ కానిస్టేబుల్ మారతాడా?” అన్న ప్రశ్న చాలా దూరదృష్టితో రాసిందే. సంభాషణ చాలా సాధారణమైనదిగా కనిపించినా బలప్రయోగం లేని ఒక రాజ్యం వస్తుందా అన్న పేదవాడి ప్రశ్న అప్పటికంటే ఇప్పుడు ఎక్కువ రెలవెంట్ అనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే రాజ్య బలప్రయోగం మీద నియంత్రణ. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా ఆటుపోట్లకు గురయ్యింది. చాలా మూడవ ప్రపంచ దేశాలలో ఈ మాత్రం ప్రజాస్వామ్యం కొద్దికాలమైనా నిలువలేకపోయింది. చాలా దేశాలు నియంతృత్వంలోకి, సైనిక పాలనలోకి వెళ్లిపోయాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఒక సమగ్రమైన రాజ్యాంగం తోడ్పడింది. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలకమైన పాత్ర నిర్వహించాడనే కీర్తి ఆయనకు దక్కింది. రాజ్యాంగం మీద దాడి పెరిగిన కొద్దీ అంబేద్కర్‌ను మననం చేసుకోవడం పెరుగుతున్నది. ఈ రాజ్యాంగంలోని ప్రాపంచిక దృక్పథం పెట్టుబడిదారీ ఆర్థిక నమూనాని ఒకవైపు అంగీకరిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని ఒక మధ్యేమార్గ ప్రయోగాన్ని వాగ్దానం చేసింది. ధనిక వర్గాలకి పెట్టుబడిదారీ పంథా, పేద వర్గాలకు సోషలిస్టు వ్యవస్థ అన్న ఒక మార్గం వేసే ప్రయత్నం చేసింది. దేశం ఎనిమిది దశాబ్దాలుగా ఒక చిక్కు మార్గంలోనే చిక్కుకుంది. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా పేదల ప్రస్తావన లేకుండా, అసమానతల తగ్గింపు, అందరికీ అవకాశాలు, మనుషులంతా సమానమే అన్న భావన లేకుండా నిలువడం కష్టం. అందరూ సమానమే అన్న భావనను డా. అంబేద్కర్ చాలా దూరదృష్టితో, ఎన్నికలలో రాజకీయంగా మనం సమానత్వాన్ని కల్పించాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒకే విలువ. ఈ సమానత్వం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు బద్దలుకొడతారు అని హెచ్చరిక చేశాడు. కానీ విచిత్రంగా సామాన్య ప్రజలు రాజ్యాంగాన్ని స్వంతం చేసుకుంటున్నారు, పాలకులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నారు. ఎన్నికల రాజకీయాలలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం డా. అంబేద్కర్ ఆశించిన సమానత్వ దిశలో కాక సమాజంలోని తీవ్ర అసమానతలు ఎన్నికలను నిర్దేశించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎనిమిది దశాబ్దాలలో మొదటి రెండు దశాబ్దాలలో సోషలిస్టు నమూనా లాంటి వ్యవస్థ అన్న భావజాలం ప్రచారంలో ఉండేది. కానీ క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతూ వచ్చింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో ఈ వైరుధ్యం కొంత స్పష్టత పొంది సమాజంలోని అసంతృప్తి విభిన్న ఉద్యమాలకు దారితీసింది. ఈ అసంతృప్తిని గ్రహించిన ఇందిరాగాంధీ పేదరికాన్ని రాజకీయాలలో ఒక ప్రధాన అంశంగా ముందుకు తీసుకురావడంతో ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లను సమీకరించుకోగలిగారు. ఆమె భావజాలం వల్ల ధనిక వర్గాల సమీకరణ బలపడడం, పేద వర్గాల ఆకాంక్షలు పెరగడం వల్ల వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో సంక్షోభంలో చిక్కుకున్న ఇందిరాగాంధీ… రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను రద్దు చేసి, అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారతదేశంలోని ‘రాజ్యాంగ ప్రజాస్వామ్యం’ (కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఎంత బలహీనంగా ఉందో ఒక్కసారి బయటపడింది. ఏ కారణం వల్ల ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించిందో ఇప్పటికీ ఆ కారణాలు పూర్తిగా విశ్లేషించలేదు. ఆమె ఎన్నికలు ప్రకటించినప్పుడు జయప్రకాశ్ నారాయణ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అరుణ్‌శౌరి కలిసి ప్రతిపక్షాలు ఏం చేయాలి అని చర్చించినప్పుడు అరుణ్‌శౌరి ఎన్నికలను బహిష్కరించాలి అని ప్రతిపాదిస్తూ… “నియంత ఎప్పుడూ తన విజయాన్ని గ్యారెంటీ చేసుకోకుండా ఎన్నికలకు వెళ్లరు” అని అంటే, “ప్రజలను మనం అంత తక్కువ అంచనా వేయకూడదు. సమాజం భయంలో ఉన్న మాట వాస్తవం. జనాన్ని మనం సమీకరించగలిగితే వ్యక్తులుగా భయపడుతున్న వాళ్లే సమిష్టిలో ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. భయానికి మందు సమిష్టిలోనే ఉంది” అని జయప్రకాశ్ నారాయణ్ చెప్పారని అరుణ్‌శౌరి వ్యక్తిగత చర్చలో నాతో అన్నాడు. అటల్‌బిహారి వాజ్‌పాయ్ కూడా జేపీ వాదనతో అంగీకరించడంతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకున్నామని అరుణ్‌శౌరి అన్నాడు. ఎన్నికల రాజకీయ చరిత్రలో మనదేశంలో 1977లో మొదటిసారిగా ప్రజలు భయం నుంచి బయటపడి అధికార పార్టీనే కాక, వ్యక్తిగతంగా ఇందిరాగాంధీని కూడా ఓడించారు. అప్పటి వరకు బలమైన నాయకుడు లేదా నాయకత్వం కేంద్రంగా నడిచే రాజకీయాల స్థానంలో సమిష్టి నాయకత్వం అధికారంలోకి వచ్చింది. భావజాలపరంగా భిన్న భావజాలాలున్న కమ్యూనిస్టు పార్టీ, జార్జ్ ఫెర్నాండెజ్, జగ్జీవన్‌రాం, మొరార్జీ దేశాయ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, ఆడ్వాణీ… ఈ సమిష్టి నాయకత్వంలో భాగం. ఇంత వైవిధ్యమైన, వైరుధ్యమైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేకపోయింది. ఎన్నికలలో ప్రజలు అంత పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినా, అంత ప్రజాబలం ఉన్నా జనతా పార్టీ కూలిపోవడం వెనుక ఓట్ల రాజకీయాల కంటే భిన్న ప్రయోజనాల మధ్య వైరుధ్యాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నదన్నది ఒక వాస్తవ అనుభవంలోకి వచ్చింది.

ఇందిరాగాంధీ రెండవసారి గెలిచినప్పుడు ఆమె రాజకీయ పరిభాషలో చాలా మార్పు వచ్చింది. ప్రధానంగా ఆమె పేదల గురించి మాట్లాడడం చాలావరకు తగ్గించింది. భిన్న వర్గాల మధ్య వైరుధ్యాలు ఎక్కడికి దారితీస్తాయో అన్న అనుమానంతో ‘దేశ సమగ్రత, సమైక్యత’ అనే నినాదాన్ని ముందుకు తీసుకువచ్చింది. దీంతో బాటు తన సోషలిస్టు భావజాలం స్థానంలో పెట్టుబడిదారీ మార్గమే ఏకైక మార్గం అనే నిర్ణయానికి రావడం, ఆమె హఠాన్మరణంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కావడంతో రాజ్యాంగంలోని సోషలిస్టు భావజాలం గురించి మాట్లాడడం దాదాపు రద్దైపోయింది. పెట్టుబడిదారీ పంథా నియో లిబరలిజం అవతారం తీసుకోవడంతో దానికుండే కొన్ని కనీస ప్రమాణాలు ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడం, ధనప్రవాహం నిరోధించడం, రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడడం, విశ్వవిద్యాలయాలు సృజనాత్మక సంస్థలుగా పనిచేయడం లాంటివి కూడా పాటించలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల రాజకీయాల స్వభావమే మారిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్యం అనే భావనను విస్తృతంగా ఉపయోగించి పెరుగుతున్న సంపదకు ఒక గౌరవాన్ని కలిగించే ప్రయత్నం చేస్తుంది. కొంతవరకు ప్రజల మద్దతును కూడగడుతుంది. నియో లిబరలిజానికి ఆ అవసరం కూడా లేకుండా పోయింది. రాజ్య స్వభావమే చాలా మార్పునకు గురయింది. సంపద జగన్నాథ రథచక్రాల లాగా ముందుకు పోతున్నది. ఇందిరాగాంధీ 1970లలో అప్పటి వైరుధ్యాల వల్ల రాజ్యాంగాన్ని తాత్కాలికంగా పక్కకు పెడితే, అప్పటి ప్రతిపక్షాలు పోరాడాయి. కాని కలిసి పనిచేయలేకపోయాయి. కనీసం జనతాపార్టీ కొంతకాలం అయినా అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అప్పటి సంక్షోభం కంటే తీవ్రమైనదైనా ప్రతిపక్షాలు కలిసే ప్రయత్నమే ముందుకు సాగడం లేదు. కలిసి ఎన్నికలలో పోటీచేయడం సాధ్యమే కావడం లేదు. వీటిని కలపడానికి ఒక జయప్రకాశ్ నారాయణ్ వంటి నాయకుడెవ్వరూ లేరు. ఎన్నికలు సారంలోనే కాదు రూపంలో కూడా మారిపోయాయి. ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. అవి ప్రజాస్వామ్యంలో ఒక భాగం. నిజమైన ప్రజాస్వామ్యం ప్రజాచైతన్య స్థాయిని బట్టి, నిరంతర జాగరూకతను బట్టి, సమస్యలకు సమిష్టిగా స్పందించే ఒక సజీవ పౌరసమాజం మీద ఆధారపడి ఉంటాయి. రాజ్యాంగాన్ని,

ఎన్నికల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని ఒక మానవీయ సమసమాజ స్వప్నాన్ని కాపాడుకోవడం ఇప్పుడు చాలా అవసరం.

## ఈ ఆర్థిక తిరోగమనం తాత్కాలికమేనా?

ప్రపంచీకరణ తర్వాత ప్రపంచంలో ఏ మూల ఏ విపత్తు సంభవించినా దాని ప్రతికూల ప్రభావం ప్రపంచమంతటా ఉంటున్నది. ముఖ్యంగా బలమైన ఆర్థిక పునాదులపై నిలబడని భారత్ వంటి వర్ధమాన దేశాలపై ఈ ప్రభావం మరింత ఎక్కువ. వ్యవసాయం, కుటీర పరిశ్రమలు బలమైన ఆర్థిక పునాదులుగా నిలిచినంత కాలం ప్రపంచవ్యాప్తంగా ఏ ఒడిదుడుకులు సంభవించినా మన దేశం పెద్దగా చలించలేదు. కానీ ఇప్పటి పరిస్థితులు వేరు. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్, అమెరికాఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల, ప్రాణనష్టాన్ని మినహాయించి చూస్తే, ఇతరత్రా అనర్థాలు ఆ యుద్ధంలో నిమగ్నమైన దేశాలలో కంటే కూడా మన దేశంలోనే ఎక్కువగా కనపడటం జీర్ణించుకోలేని ఓ చేదు వాస్తవం. నిన్న మొన్నటి దాకా ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చోటు సంపాదించి, మరో రెండు మూడేళ్ళలోనే మూడవ స్థానానికి ఎగబాకనుందని అందరూ భావిస్తున్న భారత్, ఇప్పుడు హఠాత్తుగా ప్రపంచ ర్యాంకింగ్‌లలో ఆరవ స్థానానికి పడిపోయింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ తన 202526 ఆర్థిక సంవత్సరం నివేదికలో వెల్లడించింది. నిజానికి ఇంతకుముందు భారత్ కంటే వెనుక ఉన్న యు.కె, జపాన్‌లు ఆర్థికంగా ముందుకు వెళ్ళకపోయినా ఉన్నచోట స్థిరంగానే ఉన్నాయి. భారత్ మాత్రమే తనంతట తాను వెనకబడిపోయింది. ఈ ర్యాంకింగ్ పతనం వెనుక ఆర్థిక కారణాలు ఏమీ లేవనీ, గణాంకపరమైన అంశాల వల్లనే ర్యాంకింగ్ తగ్గిందనీ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారులు చెబుతున్నారు. అమెరికన్ డాలర్లలో లెక్కించే రూపాయి విలువ క్షీణించడం వల్లనే ర్యాంకింగ్ తగ్గిందని, అలాగే దేశీయ చమురు అవసరాల కోసం పెద్ద మొత్తంలో డాలర్ల రూపంలో ముడి చమురు కొనడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందనీ, పరిస్థితులు చక్కబడ్డాక మళ్ళీ సర్దుకుంటుందనీ వారు అంటున్నారు. అయితే ఈ వాదనలో పస కనిపించడం లేదు. ప్రజలను తాత్కాలికంగా మభ్యపెట్టే ఉద్దేశమే కనిపిస్తున్నది. ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా దేశంలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయన్నది నిజమే. ముఖ్యంగా సహజ వాయువుకు, ముడి చమురుకు కొరత ఏర్పడింది. వీటి ధరలు పెరిగాయి. దేశంలో అన్ని రకాల వస్తుసేవలు ప్రియంగా మారాయి. కానీ యుద్ధం మొదలైన ఫిబ్రవరి 28 కంటే ముందే అనేక రంగాల్లో స్తబ్ధత నెలకొన్నది. పారిశ్రామిక ఉత్పత్తి గత ఐదు నెలల్లో అతి తక్కువగా 4.1శాతం మేర మాత్రమే నమోదైనట్లు ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (ఐఐపీ) తాజా గణాంకాలు వెల్లడించాయి. క్యాపిటల్ గూడ్స్‌లో అభివృద్ధి కనపడగా, నిర్మాణ రంగంలో గత తొమ్మిది నెలల్లో కేవలం 6.7శాతం పెరుగుదల మాత్రమే ఉంది. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంకా వివిధ రంగాల అభివృద్ధి గణాంకాలు పూర్తిగా వెల్లడి కాలేదు. అవన్నీ వెల్లడైన తరువాత దేశంలో ఆర్థిక ప్రగతి ఏ దిశగా పయనిస్తుందో తెలుస్తుంది. ఈ అంశాలన్నీ లెక్కలోకి తీసుకుని చూస్తే రూపాయి క్షీణత వల్ల మారకం విలువ ప్రకారం డాలర్లలోకి మార్చడంతోనే భారత జీడీపీ తక్కువగా నమోదయిందని చేస్తున్న వాదనలో నిజం లేదని అర్థం అవుతుంది. రూపాయి పతనాన్ని నిలువరించలేక ఇతరత్రా సాకులు చూపుతున్నారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం యూరో, యెన్, పౌండ్ వంటి విదేశీ కరెన్సీలపై ఎందుకు పడలేదు? మన రూపాయి పైనే ఎందుకు ఎక్కువగా పడుతున్నది? కారణం అమెరికన్ డాలర్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలతో భారత్ అధిక మొత్తంలో లావాదేవీలు నిర్వహించడం వల్లనే డాలర్ బలపడినప్పుడల్లా మన రూపాయి క్షీణిస్తోంది. ఏ దేశ ఆర్థిక వ్యవస్థ అయినా బలంగా ఉండాలంటే స్థిరమైన పెట్టుబడులు, స్థిరమైన గ్యారెంటీ ఆదాయాలు ఉండగలగాలి. ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను రక్షణ శాఖతో సహా ఇతర రంగాల్లో 50శాతానికి మించి అనుమతిస్తున్నారు. అలాగే స్టాక్ మార్కెట్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడులను (ఎఫ్.ఐ.ఐలు) ప్రోత్సహిస్తున్నారు. దీనివల్ల జరిగే నష్టం ఏమంటే రూపాయి విలువ క్షీణించినపుడల్లా విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వేగంగా జరుగుతుంది. తాజాగా పశ్చిమాసియా యుద్ధం మొదలయ్యాక స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐల ఉపసంహరణ జోరందుకుంది. స్టాక్ మార్కెట్ నుంచి రివర్స్ ఫ్లో ఎక్కువైంది. విదేశీ ఇన్వెస్టర్లు ఒక్క భారత్‌లోనే పెట్టుబడులు పెట్టాలన్న నియమం లేదు కనుక ఆకర్షణీయంగా కనిపించే ఇతర దేశాల మార్కెట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. విదేశీ ఇన్వెస్టర్ల మద్దతు కోల్పోయినపుడు దేశీయ మదుపర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. అంటే, స్థిరమైన పెట్టుబడుల్ని ఆకర్షించడానికి బదులు వ్యవస్థ మూలాలను దెబ్బతీసే పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవడం అన్నది మన ఆర్థిక వ్యవస్థలో ఉన్న సంస్థాగత బలహీనత. ఇక స్థిరమైన ఆదాయాలు అందించే వ్యవసాయం, చిన్న సూక్ష్మ తరహా పరిశ్రమల రంగాలకు ప్రభుత్వాలపరంగా ప్రోత్సాహం తగ్గిపోవడం మరో బలహీనత. వ్యవసాయం కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉండడం వల్ల రైతాంగానికి నష్టం వాటిల్లినపుడల్లా వారిని ఆదుకునే బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టేసుకొని కేంద్రం, రాష్ట్రాలు చేతులు దులుపుకుంటున్నాయి. ఫలితంగానే దేశ వ్యవసాయాభివృద్ధి రేటు సాలీనా 3.5శాతాన్ని మించడం లేదు. ముఖ్యంగా ఉత్పాదకతలో అభివృద్ధి సాధించలేకపోవడం మరో అతిపెద్ద బలహీనత. దీంతో పాటు దేశ జనాభాలో దాదాపు 35 కోట్ల మంది ఆధారపడిన చిన్న, సూక్ష్మ, గ్రామీణ పరిశ్రమలు కరోనాకాలంలో పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటికి అవసరమైన పెట్టుబడులను బ్యాంకుల ద్వారా రుణాల రూపంలో తక్కువ వడ్డీకి ఇప్పించి ఇతర ప్రోత్సాహకాలు కల్పించాలని గత నాలుగైదేళ్ళ నుంచి మొత్తుకుంటున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. కీలకమైన ఈ రంగానికి అరకొరగానే ప్రోత్సాహకాలు అందిస్తున్నారే తప్ప దీన్ని పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపచేయడం లేదు. ఆర్థిక రంగంలో బలహీనమైన మరొక పార్శ్వం దేశంలోని శ్రామిక శక్తికి తగిన నైపుణ్యాలు లేకపోవడం. ప్రతియేటా రకరకాల డిగ్రీలు పొంది జాబ్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్న యువతలో 65శాతం మందికి ఎటువంటి నైపుణ్యాలు లేకపోవడంతో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. విదేశాల్లో పనిచేసే భారతీయుల ఉత్పాదకత అద్భుతం. కానీ వారి సొంత దేశంలో మాత్రం నాసిరకం. అంటే స్వల్ప ఉత్పాదకత మాత్రమే ఉంటుందని ప్రపంచ బ్యాంకు ఏనాడో స్పష్టం చేసింది. కారణం దేశంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న శ్రామిక శక్తికి పూర్తి సామర్థ్యం, పనితనం చూపించగలిగే నైపుణ్యాలు కొరవడడమే.

# ‘డీలిమిటేషన్’పై వక్రీకరణలు!

‘డీలిమిటేషన్: దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్‌గోల్’ శీర్షికతో 28.4.2026 తేదీన ఆంధ్రజ్యోతిలో డా. జయప్రకాశ్ నారాయణ రాసిన వ్యాసంలో, “1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్లను 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించారు. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆ చర్య తీసుకున్నారు. 2001లో సీట్ల సంఖ్యలో ఆ స్తంభన వ్యవధి ముగిసింది. అయితే రాష్ట్రాలకు కేటాయించిన సీట్లలో యథాతథ స్థితిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని అప్పటి వాజపేయి ప్రభుత్వాన్ని ఒప్పించటంలో నేను కీలకపాత్ర పోషించాను” అని రాశారు. కానీ, ఇప్పుడు ఆయన వైఖరి మార్చుకోవడానికి ప్రస్తావించిన అంశాలు సమర్థనీయంగా లేవు. 1976 నుండి 2025 వరకు యాభై ఏళ్లలో వచ్చిన మార్పు ఏంటో కూడా గమనించాలి కదా! కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కుటుంబ నియంత్రణ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేసిన రాష్ట్రాల్లో జనాభా తగ్గింది, అమలు చేయని రాష్ట్రాల్లో జనాభా పెరిగింది. ఈ వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన 2011 నాటి జనగణన గణాంకాలే వెల్లడించాయి. తాజాగా 2026 జనగణన గణాంకాలు అధికారికంగా వెల్లడైన మీదట రాష్ట్రాలవారీగా జనాభా పెరుగుదల లేదా తరుగుదలపై స్పష్టత వస్తుంది. జనాభా ప్రాతిపదికపై లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేయాలని భారత రాజ్యాంగంలో పొందుపరచబడింది. దాన్ని పరిగణనలో ఉంచుకునే 1976లో ఇందిరాగాంధీ (కాంగ్రెస్), 2001లో వాజ్‌పాయి (బీజేపీ) ప్రభుత్వాలు దేశ ప్రయోజనాలు, సమస్య సంక్లిష్టత దృష్ట్యా హేతుబద్ధమైన నిర్ణయం తీసుకుని యథాతథ స్థితిని కొనసాగించాయి. 19762001 మధ్య కాలం కంటే 200125 మధ్య కాలంలో రాష్ట్రాలవారీగా జనాభా పెరుగుదల తరుగుదల విషయంలో మరింత ఎక్కువ తారతమ్యాలు ఉండవచ్చు. ఇది విస్మరించలేని వాస్తవం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ సమతుల్యత, సామాజిక న్యాయం… ఈ దృక్కోణంతో రాజకీయాలకు అతీతంగా డీలిమిటేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాలి. ఈ పూర్వరంగంలో జయప్రకాష్ నారాయణ ఒక చిట్కా పరిష్కారాన్ని సూచించారు: “కొన్నేళ్లలో వలసలు అసమతుల్యతలను సరిచేస్తాయి. ఇప్పటికే కోట్లాది కార్మికులు దక్షిణాదిన, పశ్చిమ, ఉత్తరాదిన పలు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల్ని నిర్మిస్తున్నారు, సుస్థిరపరుస్తున్నారు. ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లటాన్ని మనం సులభతరం చేయాలి. వారు ఎక్కడుంటే అదే వారి రాష్ట్రం కావాలి. అలా వారి జీవితాల్ని సౌకర్యవంతంగా, సురక్షితంగా మార్చాలి. ఆ మార్పు మన జనాభా సవాళ్లను పరిష్కరిస్తుంది.” ఇదీ వారు వ్యక్తం చేసిన అభిప్రాయం. అంటే, జనాభా పెరిగిన రాష్ట్రాల నుండి జనాభా తగ్గిన రాష్ట్రాలకు వలసలు పెరిగితే, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తే, కాలచక్రంలో సమస్య పరిష్కారం అవుతుందని వారి అభిప్రాయం. ఇది వినడానికి బానే ఉంది. మరి హైదరాబాద్ నుండి లండన్ వాషింగ్టన్ వరకు వలసదారులకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలను, తాజాగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వలసదారులను అవమానిస్తూ తన ‘ట్రూత్ సోషల్’లో షేర్ చేసిన పోస్ట్‌ను జయప్రకాష్ నారాయణ ఎలా చూస్తున్నారు? అమెరికాలో ఇటీవల 3,300 కేంద్రాలలో జరిగిన ‘నో కింగ్స్’ ర్యాలీల్లో పాల్గొన్న దాదాపు 80 లక్షల మందిలో అత్యధికులు వలసదారులే. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య వలసదారుల సమస్య. ఆంధ్రప్రదేశ్‌లో మారుమూల గ్రామాల్లో కూడా బిహార్, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారే వ్యవసాయ కూలీలుగా మొదలుకొని హోటల్ పని దాకా పనిచేస్తున్నారు. దక్షిణాది నుంచి వలస వెళ్ళిన వారికి వ్యతిరేకంగా 196070లలో ముంబై కేంద్రంగా శివసేన చేసిన విద్వేషపూరితమైన ఆందోళనా చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలి. అలాంటి ఆందోళనలు చిన్నవో పెద్దవో దేశంలో పలు రాష్ట్రాలలో జరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు దారితీసిన కారణాల్లో ఇది కూడా ఒకటి. మోదీ ప్రభుత్వం “జనాభా పరంగా సీట్లు కోల్పోతున్న ఏడు రాష్ట్రాలకూ ఊహించని బహుమతిని ప్రతిపాదించింది” అని జయప్రకాష్ నారాయణ అంటున్నారు. లోక్‌సభలో మాట్లాడిన సందర్భంలో ప్రధానమంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షా చెప్పిన మాటలు జయప్రకాష్ నారాయణగారికి ఈ విశ్వాసం కలిగించి ఉండవచ్చు. కానీ అవి కేవలం నోటి మాటలే, బిల్లులో ప్రస్తావించలేదు. సమకాలీన చరిత్ర ఏం చెబుతోంది? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందడానికి నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ‘ప్రత్యేక తరగతి హోదా’ కల్పిస్తామని వాగ్దానం చేస్తూ రాతపూర్వక ప్రకటనను పెద్దల సభలో చదివి వినిపించారు. సభ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం2014లోనే కడప ఉక్కు కర్మాగారం, ఓడ రేవు, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు అభివృద్ధి ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి మౌలిక సదుపాయాల కల్పనకు సంపూర్ణంగా ఆర్థిక తోడ్పాటు, పారిశ్రామికాభివృద్ధికి రాయితీలు… వగైరా వాగ్దానాలు చేశారు. ఆచరణలో వీటన్నింటినీ ఎగ్గొట్టిన మోదీ ప్రభుత్వంపై జయప్రకాష్ నారాయణగారికి ఎంత విశ్వాసమో! ఇది చూస్తే “వాగ్దానం ఎందరో అవివేకులను తృప్తిపరుస్తుంది” అనే తెలుగు సామెత గుర్తుకు వచ్చింది. ఇప్పుడు దానికి ఒక సవరణ: “మేకవన్నె పులి తరహా రాజకీయ నేతల వాగ్దానాలు మేధావులను కూడా సంతృప్తిపరుస్తాయి”. మహిళా రిజర్వేషన్స్ అమలు అంశాన్ని ‘డిలిమిటేషన్’తో ఎందుకు ముడిపెట్టారన్నదే అసలు ప్రశ్న. దానికి జయప్రకాష్ నారాయణ వ్యాసంలో సముచితమైన ప్రస్తావనే లేదు. మరొక ముఖ్య విషయం చట్టసభల నాణ్యతా ప్రమాణాలు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 550 (రాజ్యాంగం గరిష్ఠంగా అనుమతించిన సంఖ్య) నుండి 850కి పెంచడం వల్ల “మంది ఎక్కువైతే మజ్జిగ పలచన” అన్న సామెత తీరుగా లోక్‌సభ పనితీరు మరింత దిగజారుతుందేమోనన్న భావన వ్యక్తమవుతున్నది. సమగ్ర ఎన్నికల సంస్కరణలు అత్యవసరం. దామాషా ఎన్నికల విధానంతో సహా పలు అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. 2023లోనే చట్టం చేసిన 33శాతం మహిళా రిజర్వేషన్స్ అమలును డిలిమిటేషన్‌తో పాటు లోక్‌సభ సభ్యుల సంఖ్య పెంపుదలతో ముడిపెట్టడంలోని మతలబు ఏంటి? దానిపై జయప్రకాశ్ నారాయణగారి డొంకతిరుగుడు సమర్ధన ఆశ్చర్యాన్ని కలిగించింది.



## సీబీఐ డైరెక్టర్ పదవీకాలం మరోసారి పొడిగింపు.. తీవ్రంగా వ్యతిరేకించిన రాహుల్ గాంధీ

**సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగింపు**

**2027 మే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగింపునకు కేంద్రం ఆమోదం**

**ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం**

**ఈ నిర్ణయంపై తీవ్ర అసమ్మతి వ్యక్తం చేసిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**

**ఎంపిక ప్రక్రియను పక్షపాతంగా మార్చారంటూ రాహుల్ ఆక్షేపణ**

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. మే 24, 2026తో ముగియనున్న ఆయన పదవీకాలాన్ని 2027 మే వరకు పొడిగిస్తూ కేబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణ్ సూద్‌కు ఇది రెండోసారి లభించిన పొడిగింపు కావడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్న ఉన్నతస్థాయి సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఏసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ పొడిగింపును రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఎంపిక ప్రక్రియపై ఆయన అసమ్మతి వ్యక్తం చేస్తూ ఒక లేఖ కూడా సమర్పించారు. ఈ ప్రక్రియ పక్షపాతంగా మారిందని రాహుల్ ఆరోపించారు. “మీ ప్రభుత్వం సీబీఐని రాజకీయ ప్రత్యర్థులు, విమర్శకులను లక్ష్యంగా చేసుకోవడానికి పదేపదే దుర్వినియోగం చేసింది. ఈ పక్షపాత ప్రక్రియలో పాల్గొని నా రాజ్యాంగ బాధ్యతను నేను వదులుకోలేను. అందుకే ఈ నిర్ణయంపై నా తీవ్ర అసమ్మతిని తెలియజేస్తున్నాను,“ అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అభ్యర్థులకు సంబంధించిన కీలక సమాచారాన్ని తనకు అందించకుండా ఈ ప్రక్రియను ఒక తంతుగా మార్చారని ఆయన ఆక్షేపించారు. 1986 కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్, మే 2023లో రెండేళ్ల కాలానికి సీబీఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com